



మన్నెగూడ-వికారాబాద్ మార్గంలో విరిగిపడిన చెట్టు కొమ్మ



ఫిర్యాదులను స్వీకరిస్తున్న కలెక్టర్ ప్రతీక్‌జైన్

ప్రజా సమస్యల పరిష్కారమే లక్ష్యం

వికారాబాద్ కలెక్టర్ ప్రతీక్ జైన్

వికారాబాద్, మే 12(ఆంధ్రజ్యోతి): జిల్లాలో అపరిష్కృతంగా ఉన్న ప్రజా సమస్యలను పరిష్కరించే దిశగా అధికారులు కృషి చేయాలని కలెక్టర్ ప్రతీక్‌జైన్ తెలిపారు. సోమవారం ప్రజావాణి సందర్భంగా అదనపు కలెక్టర్లు లింగ్యానాయక్, సుధీర్, డీఆర్‌డీవో శ్రీనివాస్, ఆర్డీవో వాసు చంద్రలతో కలిసి ప్రజల నుంచి అర్జీలను స్వీకరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రజా సమస్యలపై అధికారులు దృష్టి సారించాలని సూచించారు. జిల్లా అధికారులు సమాచారం ఇవ్వకుండా ప్రజావాణికి గైర్హాజరు కాకూడదని అధికారులకు సూచించారు. ప్రజావాణిలో మొత్తం 68 ఫిర్యాదులు రాగా అందులో అధిక శాతం భూ సమస్యలు, పెన్షన్లు, హౌసింగ్, వ్యవసాయ రంగానికి సంబంధించిన దరఖాస్తులు అందినట్లు తెలిపారు. ప్రజావాణిలో వివిధ శాఖల జిల్లా అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

మేడ్చల్ కలెక్టరేట్‌లో 60 ఫిర్యాదులు

మేడ్చల్ ప్రతినిధి, మే 12(ఆంధ్రజ్యోతి) : ప్రజావాణిలో ప్రజల నుంచి వచ్చే సమస్యలను సంబంధిత అధికారులు సత్వరమే పరిష్కరించాలని ఇన్‌చార్జి అదనపు కలెక్టర్ హరిప్రియ పేర్కొన్నారు. సోమవారం కలెక్టరేట్‌లో నిర్వహించిన ప్రజావాణిలో ఆమె లా ఆఫీసర్ చంద్రవతి, తహసీల్దార్ రాజేశ్వర్‌రెడ్డిలతో కలిసి ఫిర్యాదులను స్వీకరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ వినతులపై చేపట్టిన చర్యలను వివరిస్తూ ఆన్‌లైన్ పోర్టల్‌లో అప్లోడ్ చేయాలని సూచించారు. ప్రజావాణిలో 60 ఫిర్యాదులు అందినట్లు అధికారులు తెలిపారు. కార్యక్రమంలో వివిధ శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు. ప్రభుత్వ ఆసుపత్రుల్లో వసతులను మెరుగుపర్చాలని, ప్రయివేటు ఆసుపత్రులను నియంత్రించాలని సీపీఎం ఆధ్వర్యంలో వినతిపత్రం నాయకులు పి.సత్యం, అశోక్, వినోద, రాజశేఖర్, నరేష్, శంకర్, సంతోష్, మంగ, పూజ, నర్సింగ్‌రావు, కొమురయ్య, ధర్మారెడ్డి, శ్రీమన్నారయణలు వినతిపత్రం అందజేశారు.

నిరుద్యోగ యువతకు స్వయం ఉపాధి కల్పించేందుకు ప్రభుత్వం తీసుకొచ్చిన 'రాజీవ్ యువ వికాసం' పథకం అమలుపై జిల్లా యంత్రాంగం తీవ్రంగా కసరత్తు చేస్తోంది. దరఖాస్తుల పరిశీలన అనంతరం జిల్లాకు నిర్దేశించిన లక్ష్యం మేరకు యూనిట్లను కేటాయించనున్నారు. మేడ్చల్ - మల్కాజిగిరి జిల్లాలో మొత్తం 66,500 దరఖాస్తులు రాగా 16,835 యూనిట్లు కేటాయించారు. దీనికి రూ.287 కోట్లు కేటాయించగా ఇందులో రూ.221 కోట్లు రాయితీ, రూ.66 కోట్లు లబ్ధిదారులు చెల్లించాల్సి ఉంటుంది. ప్రస్తుతం అధికారులు క్షేత్రస్థాయిలో దరఖాస్తుల పరిశీలన చేస్తున్నారు.



దరఖాస్తులు 66,500.. యూనిట్లు 16,835

ముమ్మరంగా 'యువ వికాసం' దరఖాస్తుల పరిశీలన

ఇప్పటికే మేడ్చల్ జిల్లాలో 80% పూర్తి
ప్రత్యేక కమిటీల ఆధ్వర్యంలోనే లబ్ధిదారుల ఎంపిక
వ్యక్తిగత సిబిల్ స్కోర్ పరిశీలన తప్పనిసరి
లబ్ధిదారులకు అందనున్న రూ.221 కోట్ల రాయితీ
జూన్ 2న రుణాలు ఇచ్చేలా ప్రణాళిక



దరఖాస్తులను పరిశీలిస్తున్న అధికారులు

మేడ్చల్ ప్రతినిధి, మే 12(ఆంధ్రజ్యోతి): 'రాజీవ్ యువ వికాసం' పథకానికి వివిధ కార్పొరేషన్ల కింద దరఖాస్తులు చేసుకున్న వారిలో అర్హుల జాబితాను రూపొందించడానికి సంబంధిత శాఖల అధికారులతో మండల, జిల్లా స్థాయిలో ప్రత్యేక కమిటీలను ఏర్పాటు చేశారు. ఇప్పటికే జిల్లా వ్యాప్తంగా దాదాపు 80 శాతం వరకు దరఖాస్తుల పరిశీలన పూర్తి చేశారు. పరిశీలించిన దరఖాస్తులను

మిగతా 8వ పేజీలో...

కార్పొరేషన్ల వారీగా యూనిట్ల సంఖ్య	
ఎస్సీ	6,208
ఎస్టీ	1,594
క్రిస్టియన్	1,099
మైనార్టీ	2,316
ఈబీసీ	5,618
మొత్తం	16,835

సిబిల్ స్కోరు ఆధారంగానే..

రాజీవ్ యువ వికాసం పథకం దరఖాస్తుదారుడి సంబంధిత బ్యాంకులో ఏవైనా రుణాలు తీసుకొని ఉన్నారా? అని పరిశీలించిన అనంతరం బ్యాంకు అధికారులు సిబిల్ స్కోర్‌ను పరిశీలించనున్నారు. సిబిల్ స్కోరు మెరుగ్గా ఉంటేనే వారికి రాయితీ రుణం మంజూరు చేయాలని సీఎం రేవంత్‌రెడ్డి కూడా ఇటీవల ఓ సమావేశంలో ఆదేశించిన విషయం విదితమే. జిల్లా పరిధిలో బ్యాంకుల వారీగా రుణాలు మంజూరు చేయాల్సిన లక్ష్యాలను జిల్లా అధికారులు ఇప్పటికే నిర్దేశించారు. దీనికనుగుణంగా బ్యాంకులు రుణాలు మంజూరు చేసేలా లీడ్ బ్యాంక్ ఆధ్వర్యంలో బ్యాంకర్లతో చర్చలు జరిపారు.

ఈదురు గాలుల

బీభత్సం

» విరిగిపడిన చెట్లు

పూడూరు, మే 12, (ఆంధ్రజ్యోతి): పూడూరు మండలంలో సోమవారం భారీ ఈదురు గాలులు, ఉరుములు, మెరుపులు బీభత్సాన్ని సృష్టించాయి. కొన్ని భారీ చోట్ల చెట్లు విరిగి రోడ్డుపై పడ్డాయి. మన్నెగూడ-వికారాబాద్ రోడ్డులో చెట్ల కొమ్మలు విరిగి పడటంతో వాహనాల రాకపోకలు నిలిచాయి. పోలీసులు, స్థానికుల సహాయంతో గంటపాటు శ్రమించి రోడ్డుపై విరిగి పడిన చెట్ల కొమ్మలను తొలగించారు. దీంతో ట్రాఫిక్ క్లియర్ అయింది.



ఘనంగా పాంబండ

గిరి ప్రదక్షిణ

పెద్ద సంఖ్యలో హాజరైన భక్తులు

కులకచర్ల, మే 12 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పాంబండ గిరి ప్రదక్షిణ సోమవారం సాయంత్రం వైభవంగా జరిగింది. శివనామస్మరణతో పాంబండ ఆలయం మారుమోగింది. ఈ ప్రదక్షిణ 29వ నెల సందర్భంగా పెద్ద సంఖ్యలో భక్తులు హాజరయ్యారు. అత్యధికంగా మహిళలు ఈ ప్రదక్షిణలో పాల్గొన్నారు. ప్రతీ నెల పౌర్ణమి రోజు హిందు బంధువుల ఆధ్వర్యంలో పాంబండ గిరి ప్రదక్షిణ నిర్వహిస్తారు. కార్యక్రమాన్ని ఆలయ చైర్మన్ కోట్ల మైపాల్‌రెడ్డి, ఈవో బాలనర్సయ్య పర్యవేక్షించారు. అర్చకులు దశరథం, పాండుశర్మ, అనంతమయ్య, అమరేందర్ భక్తులకు స్వామివారి దర్శనం కల్పించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయుడు నర్సింహారెడ్డి, భక్తులు పాల్గొన్నారు.





గంగా పూజలో భక్తులు

కాగ్నా నదిలో

మహా హారతి

పౌర్ణమిని పురస్కరించుకొని సోమవారం కోకట్ సమీపంలోని కాగ్నా నదిలో అర్చక సంఘం ఆధ్వర్యంలో మహా మంగళహారతి, గంగా పూజను ఘనంగా నిర్వహించారు. ప్రతీ పౌర్ణమికి జరిగే గంగా పూజ కార్యక్రమానికి ధర్మ జాగరణ సమితి ఆధ్వర్యంలో ఏర్పాట్లు చేశారు. గంగా దీపోత్సవంలో భక్తులు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు.

-తాండూరు, మే 12(ఆంధ్రజ్యోతి) :

కనుల పండువగా కల్యాణం

ఘట్‌కేసర్ రూరల్, మే12(ఆంధ్రజ్యోతి): పోచారం మున్సిపాలిటీ, వెంకటాపూర్ వేంకటేశ్వరస్వామి ఆలయ బ్రహ్మోత్సవాల్లో భాగంగా సోమవారం స్వామి వారి కల్యాణం కనులపండువగా జరిగింది. ఉదయం సుప్రభాతసేవ, బలిహరణ కార్యక్రమం నిర్వహించారు. ఆలయ ఆవరణలోని కల్యాణ మండపంపై స్వామివారి, అమ్మ వార్ల ఉత్సవ విగ్రహాలను ప్రతిష్ఠించారు. ఆలయ కమిటీ చైర్మన్ చింతపంటి సత్తయ్య యాదవ్ స్వామివారికి పట్టువస్త్రాలు, తలంబ్రాలు సమర్పించారు. భక్తులకు ఇబ్బందులు కలుగకుండా మంటపం చుట్టు చలువ పందిళ్ల ఏర్పాటు చేశారు. ఆలయ అర్చకుడు వినయ్‌శర్మ కల్యాణాన్ని ఘనంగా జరిపించారు. ఈ సందర్భంగా భక్తులు ఒడిబియ్యం, పూలు, పండ్లు, వస్త్రాలు సమర్పించారు. భక్తులకు అన్నదాన కార్యక్రమం ఏర్పాటు చేశారు. టీపీసీసీ ఉపాధ్యక్షుడు తోటకూర వజ్రేశ్‌యాదవ్, మాజీ ఎమ్మెల్యే మలిపెద్ది సుధీర్‌రెడ్డి, మాజీ జెడ్పీ చైర్మన్ మలిపెద్ది శరత్‌చంద్రారెడ్డి, మాజీ ఎంపీపీ సుదర్శన్‌రెడ్డి, బీ-బ్లాక్ అధ్యక్షుడు వేముల మహేశ్‌గౌడ్, ఆలయ ధర్మకర్తలు మేడోగని ఆంజనేయులు, ఉదారి వెంకటేశ్, కంతి లావణ్య, బండారి సుధాకర్, నాయకులు, భక్తులు తదితరులు పాల్గొన్నారు.



మంగళసూత్రంను చూపుతున్న వేద పండితుడు

కార్పొరేట్‌కు దీటుగా

ప్రభుత్వ వైద్యం

పరిగిలో నర్సింగ్ కళాశాల, ట్రామా కేర్ సెంటర్ ఏర్పాటుకు కృషి



నర్సులను సన్మానిస్తున్న మంత్రి దామోదర, పక్కన స్పీకర్ ప్రసాద్‌కుమార్, చీఫ్‌విప్ మహేందర్‌రెడ్డి

డయాలసిస్ కేంద్రంలో పడకల సంఖ్య పెంచుతాం
చౌడాపూర్‌లో పీహెచ్‌సీ ఏర్పాటుకు హామీ
రాష్ట్ర వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహ
హాజరైన స్పీకర్ ప్రసాద్‌కుమార్, చీఫ్‌విప్ మహేందర్‌రెడ్డి, ఎమ్మెల్యేలు

పరిగి/వికారాబాద్, మే12(ఆంధ్రజ్యోతి): కార్పొరేట్‌కు దీటుగా ప్రభుత్వ ఆస్పత్రుల్లో మెరుగైన వైద్య సేవలు అందించే విధంగా ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందని రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహ అన్నారు. సోమవారం పరిగిలోని సామాజిక ఆరోగ్య కేంద్రాన్ని 100 పడకల ఆసుపత్రిగా అప్‌గ్రేడ్ చేసేందుకు రూ.27 కోట్లతో నిర్మించనున్న నూతన భవన నిర్మాణానికి ఆయన శంకుస్థాపన చేశారు. ఆయనతో పాటు శాసనసభ స్పీకర్ ప్రసాద్ కుమార్, చేవెళ్ల ఎంపీ కొండా విశ్వేశ్వర్‌రెడ్డి మండలి చీఫ్‌విప్ పట్నం మహేందర్‌రెడ్డి, ఎమ్మెల్యేలు రామ్మోహన్‌రెడ్డి, మనోహర్‌రెడ్డి ఉన్నారు. ఈ సందర్భంగా నిర్వహించిన సమావేశంలో మంత్రి దామోదర మాట్లాడుతూ ప్రభుత్వ వైద్య సేవల విస్తరణలో భాగంగా పరిగిలో నర్సింగ్ కళాశాల,

మిగతా 8వ పేజీలో...

పరిగిలో అన్ని రకాల

వైద్యసేవలు



మాట్లాడుతున్న ఎమ్మెల్యే రామ్మోహన్‌రెడ్డి

పరిగి ప్రభుత్వాసుపత్రిలో త్వరలో అన్ని రకాల స్పెషాలిటీ వైద్య సేవలు అందుబాలోకి రానున్నాయని పరిగి ఎమ్మెల్యే రామ్మోహన్‌రెడ్డి తెలిపారు. పరిగి నియోజకవర్గంలో కొత్తగా పీహెచ్‌సీలు, సబ్ సెంటర్లు ఏర్పాటు చేయాలని, డయాలసిస్ సెంటర్‌లో అదనపు పడకలు మంజూరు చేయాలని ఆయన మంత్రిని కోరారు. పరిగి ఆసుపత్రిలో ట్రామాకేర్ సెంటర్ ఏర్పాటు చేయాలని, వికారాబాద్, కొడంగల్ మెడికల్ కళాశాలకు అనుసంధానంగా పరిగిలో రూరల్ హెల్త్ సెంటర్లు ఏర్పాటు చేసి వైద్య సేవలను విస్తరింప జేయాలని మంత్రికి విజ్ఞప్తి చేశారు. పరిగిలో నర్సింగ్ కాలేజీ ఏర్పాటు చేయాలని ఆయన మంత్రిని కోరారు. కార్యక్రమంలో కలెక్టర్ ప్రతీక్‌జైన్, ఎస్పీ నారాయణరెడ్డి, వైశ్య కార్పొరేషన్ చైర్‌పర్సన్ కాల్వ సుజాత, సామాజిక ఆరోగ్య శాఖ కమిషనర్ విజయకుమార్, ఆర్డీవో వాసుచంద్ర, గ్రంథాలయ సంస్థ జిల్లా చైర్మన్ రాజేష్ రెడ్డి, పరిగి, కులకచర్ల ఏఎంసీ చైర్మన్లు పరశురాంరెడ్డి ఆంజనేయులు, డీఎంహెచ్‌వో వెంకటరవణ, డీసీహెచ్‌లు ఆనంద్, ప్రదీప్, పరిగి ఆసుపత్రి సూపరింటెంట్ డాక్టర్ రాజశేఖర్, డీపీపీ ఉపాధ్యక్షుడు ఎం.లాల్‌కృష్ణప్రసాద్, ప్రధానకార్యదర్శి కె.హన్మంత్ ముదిరాజ్, పట్టణ అధ్యక్షుడు కృష్ణ పాల్గొన్నారు.

వైద్యాధికారులు అందుబాటులో ఉండాలి 7 లో..



దరఖాస్తులు స్వీకరిస్తున్న ఆర్డీవో వెంకటఉపేందర్‌రెడ్డి

భూసమస్యల పరిష్కారానికే

రెవెన్యూ సదస్సులు

కీసర రూరల్, మే 12 (ఆంధ్రజ్యోతి) : భూ సమస్యల సత్వర పరిష్కారానికే రెవెన్యూ సదస్సులు నిర్వహిస్తున్నట్లు కీసర ఆర్డీవో వెంకట ఉపేందర్‌రెడ్డి అన్నారు. సోమవారం కీసర మండల పరిధిలోని రాంపల్లి, కుందన్‌పల్లిలో నిర్వహించిన సదస్సులో ఆయన మాట్లాడారు. ప్రభుత్వం ధరణిని ఆధునీకరించి భూ భారతిని ప్రవేశపెట్టిందన్నారు. కాగా, రాంపల్లి సదస్సులో 89, కుందన్‌పల్లిలో 40 చొప్పున మొత్తం 129 అర్జీలు వచ్చినట్లు ఆయన వెల్లడించారు. కార్యక్రమంలో తహసీల్దార్ అశోక్, ఆర్ఐలు, తదితరులు పాల్గొన్నారు.

హంతకులిద్దరికీ

జీవిత ఖైదు

ఒక్కొక్కరికీ రూ.వెయ్యి జరిమానా
జిల్లా ప్రిన్సిపల్ డిస్ట్రిక్ట్ అండ్ సెషన్స్ జడ్జి తీర్పు

7

తీరనున్న డయాలసిస్

రోగుల కష్టాలు

తాండూరు కేంద్రానికి అదనంగా నాలుగు బెడ్లు
ఆస్పత్రికి ఐసీయూ మంజూరు.. నెలాఖరులోగా ఏర్పాటుకు మంత్రి ఆదేశం



తాండూరు ఆస్పత్రిలోని డయాలసిస్ కేంద్రం

తాండూరు, మే 12 (ఆంధ్రజ్యోతి): తాండూరు జిల్లా ఆస్పత్రిలోని డయాలసిస్ కేంద్రానికి అదనంగా మరో నాలుగు బెడ్లను తక్షణం ఏర్పాటు చేయాలని వైద్యారోగ్య శాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహ ఆదేశించారు. దీంతో డయాలసిస్ రోగుల కష్టాలు తీరనున్నాయి. ఈ నెలాఖరు లోపు ఈ బెడ్లను ఏర్పాటుకు మంత్రి ఆదేశించారు. గత జనవరి 20వ తేదీన ఆంధ్రజ్యోతి దినపత్రికలో 'డయాలసిస్ గుబులు... రోగులు ఎక్కువ.. బెడ్లు తక్కువ' అనే శీర్షికన ప్రచురితమైన కథనంపై మంత్రి స్పందించారు. సోమవారం వికారాబాద్ జిల్లా కేంద్రంలో జరిగిన జిలా స్థాయి వైద్య ఆరోగ్య శాఖ సమీక్ష సమావేశంలో తాండూరు ఎమ్మెల్యే బుయ్యని మనోహర్‌రెడ్డి ఈ విషయాన్ని మంత్రి దృష్టికి తీసుకెళ్లి సమస్యను వివరించారు. దీంతో స్పందించిన మంత్రి దామోదర రాజనర్సింహ అదనపు బెడ్లను ఏర్పాటు చేయాలని హెల్త్ సెక్రటరీ విజయ్ కుమార్‌ను అక్కడే ఆదేశించారు. దీంతో ఏడాది కాలంగా ఇబ్బంది పడుతున్న డయాలసిస్ రోగుల కష్టాలు తీరనున్నాయి. ఈ అంశంలో పలువురు డయాలసిస్ రోగులు ఆంధ్రజ్యోతికి అదనపు బెడ్లు మంజూరు చేయించడం పట్ల కృతజ్ఞతలు తెలిపారు.

తక్షణ చర్యలకు ఆదేశాలు

తాండూరు ప్రభుత్వ జిల్లా ఆస్పత్రిలో తక్షణమే ఐసీయూ యూనిట్‌ను ఏర్పాటు చేయుటకు మంత్రి దామోదర రాజనర్సింహ ఆదేశాలు జారీ చేసినట్లు ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి తెలిపారు. సోమవారం వికారాబాద్ మంత్రి పర్యటనలో ఆస్పత్రి సమస్యలను మంత్రి దృష్టికి తీసుకెళ్లగా ఆయన తక్షణమే స్పందించి చర్యలకు ఆదేశించారని ఎమ్మెల్యే వివరించారు. అలాగే ఆస్పత్రికి రెండు కొత్త అంబులెన్స్‌లు కావాలని కోరగా నెలాఖరులో మంజూరు చేస్తామని హామీ ఇచ్చినట్లు తెలిపారు. అలాగే పెద్దేముల్ ప్రభుత్వ ఆస్పత్రిలో 24 గంటలు వైద్య సేవలు అందే విధంగా చూడాలని, బషీరాబాద్ మండలం నవల్గా గ్రామంలో పీహెచ్‌సీని ఏర్పాటు చేయాలని కోరగా త్వరలోనే చర్యలు తీసుకుంటానని మంత్రి హామీ ఇచ్చినట్లు వివరించారు.



వైభవంగా కల్యాణ మహోత్సవాలు

- వేడుకల్లో పాల్గొన్న భక్తులు
- ప్రత్యేక పూజలు.. అన్నదానాలు
- ఆధ్యాత్మిక శోభను సంతరించుకున్న గ్రామాలు

ఇబ్రహీంపట్నం, మే 12 (ఆంధ్రజ్యోతి): ఇబ్రహీంపట్నం సమీపంలోని కొండపై వెలిసిన శ్రీ లక్ష్మీనృసింహస్వామి ఆలయ ప్రాంగణంలో ఆదివారం రాత్రి స్వామివారి కల్యాణాన్ని వైభవంగా నిర్వహించారు. ఈ ఉత్సవంలో ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. స్వామివారి కృప నియోజకవర్గ ప్రజలపై ఉండాలని, వర్షాలు సమృద్ధిగా కురిసి పాడిపంటలు వెల్లివిరియాలని కోరుకున్నట్లు తెలిపారు. ఆలయ అభివృద్ధికి తనవంతు కృషి చేస్తానన్నారు. కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్మన్ గురునాథ్‌రెడ్డి, ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.


ఇబ్రహీంపట్నం: శ్రీ లక్ష్మీ నృసింహస్వామి కల్యాణోత్సవంలో ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి

మున్సిపల్ మాజీ వైస్‌చైర్మన్ ఆకుల యాదగిరి, వసంత దంపతులు స్వామివారికి వెండి పాదాలు చేయించి ఆలయ అధికారులకు అందజేశారు. ఆదిభట్ల మున్సిపాలిటీ కొంగరకలాన్‌లో జరిగిన శ్రీలక్ష్మీనృసింహస్వామి కల్యాణోత్సత్సవంలో ఎమ్మెల్యే రంగారెడ్డి పాల్గొన్నారు. సోమవారం మండల పరిధిలోని పోచారంలో జరిగిన శ్రీ లక్ష్మీనృసింహస్వామి కల్యాణోత్సత్సవంలో భక్తులు పెద్దఎత్తున పాల్గొన్నారు.


అనంతపద్మనాభస్వామి కల్యాణంలో దంపతులు

అనంతపద్మనాభస్వామి ఆలయంలో..

కొత్తూర్: మండల పరిధిలోని పెంజర్ల గ్రామ శివారులో వెలసిన శ్రీఅనంతపద్మనాభస్వామి ఆలయంలో వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా సోమవారం అనంతపద్మనాభస్వామి కల్యాణ మహోత్సవం ఆలయ పాలకమండలి చైర్‌పర్సన్ బెజవాడ అనితారెడ్డి ఆధ్వర్యంలో ఘనంగా జరిగింది. గ్రామస్తులతోపాటు చుట్టుపక్కల గ్రామాల నుంచి పలువురు దంపతులు కల్యాణ మహోత్సవంలో పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. కల్యాణ తంతు జరిగిన తర్వాత అన్నదానం చేశారు. కార్యక్రమంలో మాజీ జడ్పీటీసీలు మామిడి శ్యాంసుందర్‌రెడ్డి, విశాలశ్రవణ్, ఆలయ కమిటీ సభ్యులు కుమ్మరి రమేశ్, ఇంద్రసేన, పద్మారెడ్డి, శంకర్, నాయకులు సిద్ధార్థరెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, ప్రవీణ్‌రెడ్డి, సుధాకర్, నవీన్‌రెడ్డి, దామోదర్‌రెడ్డి, దేశాల భీమయ్య పాల్గొన్నారు.

ఘనంగా రథోత్సవం

మర్పల్లి: వికారాబాద్ జిల్లా మర్పల్లి మండలంలోని సిరిపురం గ్రామంలో సోమవారం భద్రకాళీ భద్రేశ్వర స్వామి కల్యాణ మహోత్సవాన్ని వైభవంగా నిర్వహించారు. ఈ నెల 7 నుంచి 19 వరకు ఆలయ బ్రహ్మోత్సవాల సందర్భంగా ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్నారు. సోమవారం నిర్వహించిన కల్యాణ మహోత్సవానికి భక్తులు పెద్ద ఎత్తున హాజరయ్యారు. సాయంత్రం స్వామివారి రథోత్సవం కనులపండువగా సాగింది. మండల కేంద్రంతోపాటు వివిధ గ్రామాలకు చెందిన భక్తులు ప్రత్యేక పూజలు చేశారు.


మర్పల్లి: ఆలయం ఎదుట రథోత్సవంలో గ్రామస్తులు

భక్తిశ్రద్ధలతో రుద్రహోమం




కులకచర్ల, మే 12 (ఆంధ్రజ్యోతి): బండవెల్కిచర్ల పాంబండ రామలింగేశ్వరస్వామి ఆలయంలో అర్చకులు పాండు శర్మ నేతృత్వంలో సోమవారం రుద్రహోమం, స్వామివారి పల్లకీసేవ నిర్వహించారు. ఆలయ చైర్మన్ షైపాల్‌రెడ్డి పర్యవేక్షించారు. ప్రతి పౌర్ణమిన రుద్రహోమం నిర్వహిస్తున్నారు.

సందడిగా కట్టమైసమ్మ జాతర

పాల్గొన్న ఎంపీ ఈటల, ఎమ్మెల్యే మల్లారెడ్డి, మాజీ ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి

శామీర్‌పేట, మే 12 (ఆంధ్రజ్యోతి): శామీర్‌పేట పెద్ద చెరువు కట్టమైసమ్మ ఆలయ జాతర సోమవారం వైభవంగా జరిగింది. ఆలయ చైర్మన్ మహేందర్‌యాదవ్, ఆలయ కమిటీ సభ్యుల ఆధ్వర్యంలో మహిళలు బోనాలు సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. భక్తులకు అన్నదానం చేశారు. అమ్మవారు ఆలయం వద్ద భవిష్యవాణి (రంగం ఎక్కారు) వినిపించారు. పోతరాజులు విన్యాసాలు ఆకట్టుకున్నాయి. అమ్మవారికి గంగ తెప్పను వదిలారు. ఉత్సవాల్లో ఎంపీ ఈటల రాజేందర్, ఎమ్మెల్యే చామకూర మల్లారెడ్డి, మాజీ ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి, కాంగ్రెస్ నియోజకవర్గ ఇన్‌చార్జి వజ్రేష్‌యాదవ్, డీసీసీ అధ్యక్షుడు సింగిరెడ్డి హరివర్ధన్‌రెడ్డి, ఆర్టీఏ సభ్యుడు జైపాల్‌రెడ్డి, మార్కెట్ కమిటీ చైర్మన్ నర్సింహులుయాదవ్ ప్రత్యేక పూజలు చేశారు.


శామీర్‌పేట కట్టమైసమ్మ ఉత్సవాల్లో ఎంపీ ఈటల రాజేందర్, తదితరులు





పంట మార్పిడితో అధిక దిగుబడి

రైతు కమిషన్ సభ్యుడు రాములునాయక్

ఘట్‌కేసర్, మే 12 (ఆంధ్రజ్యోతి): రైతులు తప్పనిసరిగా పంట మార్పిడి పద్ధతిని పాటించాలని రాష్ట్ర రైతు కమిషన్ సభ్యుడు, మాజీ ఎమ్మెల్సీ ఎస్.రాములునాయక్ అన్నారు. సోమవారం పోచారంలో జరిగిన రైతు ముంగిట్లో శాస్త్రవేత్తలు కార్యక్రమానికి హాజరై మాట్లాడారు. రైతులు ఒకే పంటను ఎక్కువసార్లు ఆదే భూమిలో సాగు చేయడం వల్ల భూసారం తగ్గి దిగుబడి తగ్గుతుందన్నారు. వరి పంటకు బదులు జొన్న, సజ్జ, రాగులు, కొర్రలు, పెసర్లు, మినుములు సాగుచేస్తే లాభదాయకంగా ఉంటుందని పేర్కొన్నారు. రసాయనిక ఎరువుల వాడకాన్ని తగ్గించి, సేంద్రియ ఎరువుల వైపు మొగ్గు చూపాలని సూచించారు. అనంతరం ప్రొఫెసర్ జయశంకర్ విశ్వవిద్యాలయం ప్రొఫెసర్ డాక్టర్ నరేందర్‌రెడ్డి, డాక్టర్ జె.సురేష్ మాట్లాడుతూ రైతులు నాణ్యమైన విత్తనాలను ఎంపిక చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో వ్యవసాయ శాఖ ఏడీఏ వెంకట్‌రాంరెడ్డి, ఏఓ బాసిత్, సహకార సంఘం వైస్ చైర్మన్ అనంతరెడ్డి, రైతుబంధు మండల మాజీ కమిటీ చైర్మన్ కొంతం అంజిరెడ్డి, రైతులు రాములు, ప్రభ ఆకర్‌రెడ్డి, యాదగిరి, బాల్‌రెడ్డి, సుదర్శన్ పాల్గొన్నారు.


మాట్లాడుతున్న రాష్ట్ర రైతు కమిషన్ సభ్యుడు రాములునాయక్

ఓవర్ హెడ్ ట్యాంకుపై సమగ్ర నివేదిక ఇవ్వాలి



కులకచర్ల, మే 12 (ఆంధ్రజ్యోతి): మండలంలోని బండవెల్కిచర్ల గ్రామంలోని ఓవర్‌హెడ్ తాగునీటి ట్యాంకుపై జూన్ 24లోగా సమగ్ర నివేదిక ఇవ్వాలని తెలంగాణ మానవ హక్కుల కమిషన్ కలెక్టర్‌ను నివేదిక కోరింది. గ్రామంలో ఎస్సీ కాలనీ వెనక ఓవర్ హెడ్ ట్యాంకును 30 ఏళ్ల క్రితం నిర్మించారు. శిథిలావస్థకు చేరి కూలేందుకు సిద్ధంగా ఉంది. ట్యాంకు పైభాగం పూర్తిగా దెబ్బతింది. ప్రస్తుతం ట్యాంకులోకి నీరు వదలడం లేదు. ఓ దినపత్రికలో వచ్చిన కథనంపై హెచ్‌ఆర్‌సీ స్పందించింది. సుమోటోగా కేసు నమోదు చేసి సమగ్ర నివేదిక ఇవ్వాలని తెలంగాణ మానవ హక్కుల కమిషన్ కలెక్టర్‌ను కోరింది.

సాంకేతిక సమస్యతో నిలిచిన భూ రిజిస్ట్రేషన్లు

దోమ, మే 12 (ఆంధ్రజ్యోతి): దోమ తహసీల్దార్ కార్యాలయంలో సోమవారం భూ భారతి పోర్టల్‌లో సాంకేతిక సమస్య కారణంగా రిజిస్ట్రేషన్‌లు నిలిచిపోయాయి. రిజిస్ట్రేషన్‌కు వచ్చిన రైతులు, వ్యాపారస్తులు సాయంత్రం వరకు వేచి ఉండి చేసేదేమి తిరిగి వెళ్లిపోయారు. ఈ విషయంపై డిప్యూటీ తహసీల్దార్ నర్సింహులును వివరణ కోరగా ఉదయం నుంచే సాంకేతిక సమస్యతో పోర్టల్ ఓపెన్ కాలేదని తెలిపారు. ఉన్నతాధికారులు స్పందించి రిజిస్ట్రేషన్లు సాఫీగా జరిగేలా చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరారు.

రైతుభరోసా అందరికీ వర్తింపజేయాలి

పరిగి, మే 12 (ఆంధ్రజ్యోతి): రైతుభరోసా, పంట రుణాల మాఫీని అర్హులందరికీ పూర్తిస్థాయిలో వర్తింపజేయాలని తెలంగాణ కిసాన్ సంఘ్ ఆధ్వర్యంలో సోమవారం పరిగి తహసీల్దార్ కార్యాలయంలో ఆర్డీవో వాసుచంద్ర, తహసీల్దార్ ఆనంద్‌రావులకు వినతిపత్రాన్ని అందజేశారు. టీకేఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు అందె విజయ్‌కుమార్ మాట్లాడుతూ.. రుణమాఫీ సగం మంది రైతులకు కూడా కాలేదన్నారు. ఎన్‌పీఏ ఖాతాల రైతులకు అసలే మాఫీ కాలేదన్నారు. ప్రతీ రైతు కుటుంబానికి రూ.2లక్షల రుణమాఫీ చేయాలని డిమాండ్ చేశారు. రైతు భరోసా పది ఎకరాల వరకు ఇవ్వాలన్నారు. 40 శాతం మందికి రైతుభరోసా, రుణమాఫీ కాలేదని, వీరందరికీ వచ్చేలా చర్యలు తీసుకోవాలని ఆయన కోరారు.


ఆర్డీవో వాసుచంద్రకు వినతిపత్రాన్ని అందజేస్తున్న విజయ్‌కుమార్





పెద్ద చెరువు కాల్వల పరిశీలన

బొంరాస్‌పేట్, మే 12 (ఆంధ్రజ్యోతి): బొంరాస్‌పేట్ మండల కేంద్రంలోని పెద్ద చెరువు ఏటి కాల్వ, పంట కాల్వలను ఇరిగేషన్ అధికారులు రమణారెడ్డి, శ్రీధర్, జోసెఫ్, కిరణ్, శ్రీకాంత్, వంశీకృష్ణ సోమవారం పరిశీలించారు. పెద్ద చెరువు మరమ్మతులకు రూ.3 కోట్ల 80 లక్షలతో పంట కాల్వలు, ఏటి కాల్వలు తదితర వాటి మరమ్మతు పనులను చేపట్టనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో కాంగ్రెస్ మండల అధ్యక్షుడు నర్సింహులుగౌడ్, రైతులు లచ్చప్ప, గోపాల్, పాండు, రాములు, సత్య వెంకట నర్సింహులు తదితరులు పాల్గొన్నారు.


కాల్వలను పరిశీలిస్తున్న ఇరిగేషన్ అధికారులు


ఆమనగల్లు: ర్యాలీ నిర్వహిస్తున్న నాయకులు


చౌడాపూర్: పూజల్లో గ్రామస్తులు, నాయకులు

అమర జవాన్లకు ఘన నివాళి

ఆమనగల్లు, మే 12 (ఆంధ్రజ్యోతి): ఆపరేషన్ సింధూర్‌లో భాగంగా పాకిస్థాన్‌తో జరిగిన పోరాటంలో వీరమరణం పొందిన భారత సైనికులు మురళీనాయక్, సచిన్‌యాదవ్‌లకు బీజేపీ, బీఆర్‌ఎస్ పార్టీలు, గిరిజన సంఘాల నాయకులు నివాళి అర్పించారు. ఆమనగల్లు పట్టణంలో సోమవారం రాత్రి కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో నేనావత్ పత్యనాయక్, పాపిశెట్టి రాము, గోరటి నర్సింహ, నరేందర్ రాథోడ్, రవిరాథోడ్, రమేశ్‌నాయక్, విక్రమ్‌రెడ్డి, లక్ష్మణ్, శేఖర్, కృష్ణ యాదవ్, ఈశ్వర్, భరత్, మల్లేశ్, గణేశ్, పంతునాయక్, జయరాంబాలు, నరేశ్, సీతారాం, మహేశ్, విజయేందర్, రాజు, చందు, అమర్‌సింగ్, శ్రీనునాయక్, బాలునాయక్, తదితరులు పాల్గొన్నారు.

చౌడాపూర్: భారత్, పాక్ ఉద్రిక్తతల నేపథ్యంలో సైనికులు ఆయురారోగ్యాలతో ఉండాలని మండల కేంద్రంలోని కాశీ విశ్వేశ్వరస్వామి ఆలయంలో సోమవారం స్థానికులు ప్రత్యేక పూజలు చేశారు. ఉపాధ్యాయ సంఘాల నాయకులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

అనుమతులు లేని విద్యాసంస్థలపై చర్యలు తీసుకోవాలి

» టీఎస్ఎస్‌వో రాష్ట్ర అధ్యక్షుడు లక్ష్మీనివాస్



మాట్లాడుతున్న లక్ష్మీనివాస్

ఆమనగల్లు, మే 12 (ఆంధ్రజ్యోతి): అనుమతులు లేకుండా అడ్మిషన్లు తీసుకుంటున్న ప్రైవేట్ విద్యా సంస్థలపై ప్రభుత్వం కఠిన చర్యలు తీసుకోవాలని తెలంగాణ సామాజిక స్టూడెంట్ ఆర్గనైజేషన్ రాష్ట్ర అధ్యక్షుడు మీసాల లక్ష్మీనివాస్ డిమాండ్ చేశారు. ప్రైవేట్ పాఠశాలల్లో ఫీజుల దోపిడీని అరికట్టాలని కోరారు. ఆమనగల్లు పట్టణంలో సోమవారం విలేకరులతో మాట్లాడుతూ వచ్చే విద్యా సంవత్సరం ప్రారంభం నాటికి అన్ని ప్రభుత్వ డిగ్రీ, జూనియర్ కళాశాలలు, పాఠశాలల్లో మౌలిక వసతులు కల్పించాలన్నారు. అద్దె భవనాలు, శిథిల భవనాల్లో నడుస్తున్న గురుకులాలు, విద్యా సంస్థలకు నూతన భవనాలు నిర్మించాలన్నారు. రాష్ట్రంలో అనుమతులు లేని విద్యా సంస్థలను సీజ్ చేసి యాజమాన్యాలపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. అన్ని కార్పొరేట్ విద్యా సంస్థల్లో విద్యా హక్కు చట్టం అమలు చేయాలని కోరారు. రాష్ట్రంలో విద్యా శాఖకు మంత్రిని నియమించాలన్నారు. విద్యారంగ సమస్యలను పరిష్కరించకపోతే టీఎస్ఎస్‌వో ఆధ్వర్యంలో ఉద్యమ కార్యాచరణ రూపొందిస్తామని హెచ్చరించారు. సమావేశంలో నాయకులు రఘు, సుధాకర్, సంపత్ ఉన్నారు.



బట్టల కొలతలను పరిశీలించిన డీఆర్‌డీఏ డీపీఎం నర్సింహులు

యూనిఫాం కొలతల ప్రకారం కుట్టాలి

» డీఆర్‌డీఏ డీపీఎం నర్సింహులు

చౌదరిగూడ, మే 12(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ పాఠశాలల్లో చదివే విద్యార్థులకు అందించే యూనిఫాంను కొలతల ప్రకారం కుట్టాలని డీఆర్‌డీఏ డీపీఎం నర్సింహులు అన్నారు. సోమవారం జిల్లేడ్ చౌదరిగూడ మండల కేంద్రంలోని యూనిఫాం స్టిచ్చింగ్ కేంద్రాన్ని పరిశీలించారు. విద్యార్థులకు సరిపోయేవిధంగా డ్రెస్‌లు ఉండాలని టైలర్లకు సూచించారు. మండలంలో ఎదిర, చౌదరిగూడ, ఎల్కాగూడలో కుట్టు మిషన్ కేంద్రాలను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. మండలంలో మొత్తం విద్యార్థుల సంఖ్య 2,464 ఉండగా అబ్బాయిలు 1,164, అమ్మాయిలు 1,300 మంది ఉన్నట్లు తెలిపారు. కార్యక్రమంలో మండల మహిళా అధ్యక్షురాలు జయమ్మ, కార్యదర్శి ధనలక్ష్మి, ఏపీఎం నరసింహ, సీసీలు రమేష్, దేవయ్య పాల్గొన్నారు.



విద్యార్థులను ఇంటికి పంపుతున్న ఏబీవీపీ నాయకులు

సమ్మర్ క్యాంప్ పేరుతో తరగతులా?

» విద్యార్థులను ఇళ్లకు పంపిన ఏబీవీపీ నాయకులు

కడ్తాల్, మే 12(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా తరగతులు నిర్వహిస్తున్న కడ్తాల కృష్ణవేణి పాఠశాల నిర్వాహకులపై ఏబీవీపీ నాయకులు ఆగ్రహం వ్యక్తం చేశారు. సెలవుల్లో పాఠశాలలు నిర్వహించడం ఏంటని ప్రశ్నించారు. సమ్మర్ క్యాంప్ పేరుతో తరగతులు నిర్వహిస్తున్న పాఠశాలపై చర్యలు తీసుకోవాలని పలుమార్లు ఎంఈవోకు ఫిర్యాదు చేసినా స్పందించలేదని ఆరోపించారు. ఏబీవీపీ రాష్ట్ర నాయకుడు క్యామ శ్రీకాంత్ ఆధ్వర్యంలో ఏబీవీపీ నాయకులు, కార్యకర్తలు సోమవారం కృష్ణవేణి పాఠశాల వద్దకు చేరుకున్నారు. తరగతి గదుల్లో ఉన్న విద్యార్థులను చూసి పాఠశాలను బంద్ చేయించి విద్యార్థులను ఇళ్లకు పంపించారు. కార్యక్రమంలో నాయకులు లండం మల్లేశ్, గోరటి భరత్, విజయ్‌కుమార్, పవన్, శ్రీకాంత్, సాయికిశోర్, శ్రీకాంత్, విష్ణు, దర్శేందర్, మున్న, ఆనంద్ పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న రామస్వామి

హామీల అమలులో కాంగ్రెస్ విఫలం

చేవెళ్ల, మే 12(ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ ప్రభుత్వం ఆరు గ్యారెంటీల అమలులో విఫలమైందని సీపీఐ రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడు రామస్వామి ఆరోపించారు. సోమవారం మండల పరిధిలోని రామన్నగూడలో గ్రామ కార్యదర్శి పాపయ్య అధ్యక్షతన నిర్వహించిన సమావేశానికి హాజరై మాట్లాడారు. ప్రభుత్వం స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహించకుండా కాలయాపన చేస్తోందని, స్థానిక సంస్థల్లో పరిపాలన లేక గ్రామాల అభివృద్ధి కుంటుపడిందన్నారు. అనంతరం గ్రామ కమిటీని ఎన్నుకున్నారు. కార్యక్రమంలో ఏఐటీయూటీ జిల్లా కార్యదర్శి సత్యనారాయణ, మండల కార్యదర్శి సత్తిరెడ్డి, నాయకులు మక్బూల్, శివ, మంజుల, మీనాక్షి పాల్గొన్నారు.



పోస్టర్ ఆవిష్కరిస్తున్న పెంటయ్య, నాయకులు

కార్మికుల హక్కులను కాలరాస్తున్న కేంద్రం

ఆమనగల్లు/తలకొండపల్లి, మే12(ఆంధ్రజ్యోతి): కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం కార్మిక వ్యతిరేక విధానాలను అవలంభిస్తుందని సీఐటీయూ ఆమనగల్లు ఏరియా కన్వీనర్ పెంటయ్య ఆరోపించారు. సోమవారం ఆమనగల్లు మున్సిపాలిటీ కార్యాలయం వద్ద ఈనెల 20న చేపట్టే సార్వత్రిక సమ్మె పోస్టర్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ సార్వత్రిక సమ్మెను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. నాయకులు లాలునాయక్, తదితరులు పాల్గొన్నారు. అలాగే తలకొండపల్లి మండల కేంద్రంలో సీఐటీయూ నాయకులు ఈనెల 20న నిర్వహించే సార్వత్రిక సమ్మె విజయవంతంపై సన్నాహక సమావేశం నిర్వహించారు. కార్మికులుతో కలిసి సమ్మె పోస్టర్ ఆవిష్కరించారు.



వేలం నిర్వహిస్తున్న ఎక్సైజ్ సీఐ బద్యనాథ్ చౌహాన్

వాహనాలకు వేలం.. రూ.4,91,824 ఆదాయం

ఆమనగల్లు, మే 12(ఆంధ్రజ్యోతి): ఆమనగల్లు ఎక్సైజ్ సర్కిల్ కార్యాలయం ఆవరణలో సోమవారం వివిధ కేసుల్లో పట్టుబడ్డ వాహనాలకు సీఐ బద్యనాథ్ చౌహాన్ ఆధ్వర్యంలో వేలం నిర్వహించారు. ఎక్సైజ్ సర్కిల్ పరిధిలోని ఆమనగల్లు, కడ్తాల్, తలకొండపల్లి, మాడ్గుల మండలాల పరిధిలో పట్టుబడ్డ ఎనిమిది వాహనాలకు నిర్వహించిన వేలం ద్వారా రూ.4,91,824 ఆదాయం లభించింది. కార్యక్రమంలో ఎస్ఐలు అరుణ్‌కుమార్, స్వప్న, కృష్ణప్రసాద్, సిబ్బంది పాల్గొన్నారు.

పాఠశాలల్లో మౌలిక వసతులు కల్పించాలి



కలెక్టరేట్ వద్ద నిరసన తెలుపుతున్న నాయకులు

మేడ్చల్ (ప్రతినిధి, మే 12(ఆంధ్రజ్యోతి): పాఠశాలలు ప్రారంభం కాకముందే జిల్లాలోని అన్ని ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక వసతులు కల్పించాలని ఆమ్ ఆద్మీ పార్టీ సెంట్రల్ జోన్ కమిటీ డిమాండ్ సభ్యులు డిమాండ్ చేశారు. ఈ మేరకు సోమవారం అదనపు కలెక్టర్ హరిప్రియకు వినతిపత్రం అందజేసి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రతి ప్రభుత్వ పాఠశాలల్లో మరుగుదొడ్లు, తాగు నీటి సదుపాయం, రాత్రి వాచ్‌మెన్‌లు, ఆయాలను ఏర్పాటు చేయాలన్నారు. ప్రతి పాఠశాలలో జూనియర్ అసిస్టెంట్‌ను, అటెండర్‌ను నియమించాలన్నారు. తరగతి గదులను, ప్లే గ్రౌండ్స్, మధ్యాహ్న భోజనం తయారీకి గ్యాస్ సిలిండర్లను సరఫరా చేయాలన్నారు. ప్రభుత్వ పాఠశాలల వద్ద ఆక్రమణలను తొలగించి సీసీ టీవీలను ఏర్పాటు చేయాలన్నారు. సెంట్రల్ కమిటీ సభ్యులు బి.సుధారాణి, జావేద్, షరీఫ్, అజీమ్ బేగ్, ఎండీ షహబాగ్, యూనస్, ఎస్.ఎన్.రెడ్డి, బి.రమ్యగౌడ్, షీల, శ్రీలత పాల్గొన్నారు.



మాట్లాడుతున్న మంత్రి దామోదర రాజనర్సింహ, పక్కన స్పీకర్ ప్రసాద్‌కుమార్, మండలి విప్ మహేందర్‌రెడ్డి, ఎంపీ కొండా విశ్వేశ్వర్‌రెడ్డి, ఎమ్మెల్యేలు రామ్మోహన్‌రెడ్డి, మనోహర్‌రెడ్డి

వైద్యాధికారులు అందుబాటులో ఉండాలి

» ప్రైవేట్ ఆసుపత్రులను తనిఖీ చేయాలి

» వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహ

వికారాబాద్, మే 12 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): వైద్యాధికారులు విధిగా బాధ్యతలు నిర్వర్తించాలని వైద్య ఆరోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహ అన్నారు. సోమవారం కలెక్టరేట్‌లో స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్, శాసన మండలి చీఫ్ విప్ మహేందర్ రెడ్డి, ప్రజా ప్రతినిధులు, ఉన్నతాధికారులతో కలిసి ప్రభుత్వాసుపత్రులు, వైద్య కళాశాల నిర్వహణ, మౌలిక సదుపాయాల కల్పన, బ్లడ్‌బ్యాంక్, విధుల నిర్వహణ తదితర అంశాలపై సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. డీఎంహెచ్‌వో, సూపరింటెండెంట్ జవాబుదారీతనంతో వ్యవహరించాలన్నారు. ఆసుపత్రుల్లో వైద్యాధికారులు, సంబంధిత అధికారులు అందుబాటులో ఉండాలని, లేరని ఫిర్యాదులు వస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. ప్రైవేట్ ఆసుపత్రులను ఎప్పటికప్పుడు తనిఖీ చేయాలని, ప్రభుత్వ నిబంధనలకు అనుగుణంగా ఉన్నాయా లేదా అని పరిశీలించాలని ఆదేశించారు. జనాభా ప్రాతిపదికన దూరాన్ని పరిగణనలోకి తీసుకుని ఆరోగ్య కేంద్రాలు ఏర్పాటు చేస్తామని తెలిపారు.

బ్లాక్ స్పాట్లను గుర్తించాలి

రోడ్డు ప్రమాదాలు అధికంగా జరిగే ప్రాంతాలను మరోసారి పరిశీలించాలని, రోడ్డు భద్రత సమావేశాలు ఏర్పాటు చేసి బ్లాక్ స్పాట్లను గుర్తించాలని మంత్రి కలెక్టర్‌కు సూచించారు. ప్రమాదాలు జరిగితే గాయపడ్డ వారికి సత్వర వైద్య సేవలు అందే విధంగా ట్రామా కేర్ సెంటర్లు ఏర్పాటు చేసి, ఒక్కో సెంటర్‌కు రూ.5.5 కోట్లు కేటాయిస్తున్నామన్నారు. ప్రభుత్వాసుపత్రుల్లో మందుల కొరత లేకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. ప్రభుత్వ మెడికల్ కళాశాల భవనాల నిర్మాణ పనులు త్వరగా పూర్తయ్యేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. అధ్యాపకులు, వైద్య విద్యార్థులు ఇబ్బందులు పడకుండా వసతి గృహాలు, సిబ్బంది నివాస గృహాల నిర్మాణాలు పూర్తి చేయాలని సూచించారు. వైద్య కళాశాల, వసతి గృహాల్లో అవసరమైన మరమ్మతులు చేయాలన్నారు. కార్యక్రమంలో చేవెళ్ల ఎంపీ కొండా విశ్వేశ్వర్‌రెడ్డి, ఎమ్మెల్యేలు రామ్మోహన్‌రెడ్డి, మనోహర్‌రెడ్డి, డీఎంఈ డాక్టర్ నరేంద్రకుమార్, ఆరోగ్య, కుటుంబ సంక్షేమ కమిషనర్ అజయ్‌కుమార్, జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్, అదనపు కలెక్టర్లు లింగ్యానాయక్, సుధీర్, ఆర్డీవో వాసుచంద్ర, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ రాజేష్‌రెడ్డి పాల్గొన్నారు.

రెవెన్యూ సదస్సులతో సమస్యలు పరిష్కారం

» షాద్‌నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్



రైతుల సమస్యలు తెలుసుకుంటున్న ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్

చౌదరిగూడ, మే 12(ఆంధ్రజ్యోతి): గ్రామాల్లో నిర్వహిస్తున్న రెవెన్యూ సదస్సులతో రైతులు ఎదుర్కొంటున్న సమస్యలు పరిష్కరించుకోవచ్చని షాద్‌నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ అన్నారు. సోమవారం కొందుర్గు మండల పరిధిలోని ఆగిర్యాల తహసీల్దార్ జగదీశ్వర్ ఆధ్వర్యంలో కొనసాగుతున్న రెవెన్యూ సదస్సులకు ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. అనంతరం రైతుల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ గ్రామాల్లో భూతగాదాలను పరిష్కరించేందుకు రాష్ట్ర ప్రభుత్వం ఎంతో ప్రతిష్ఠాత్మకంగా పైలట్ ప్రాజెక్టుగా కొందుర్గు మండలాన్ని ఎంపిక చేసిందని తెలిపారు. రైతులకు, వారసులకు న్యాయబద్ధంగా చెందాల్సిన భూవాటాలు (కమతాలు) తేడాలు రాకుండా గ్రామీణ స్థాయి ప్రజాక్షేత్రంలోనే న్యాయం జరుగుతుందన్నారు. రైతుల నుంచి వచ్చిన దరఖాస్తులను స్వీకరించి పరిష్కరించేందుకు అధికారులు కృషి చేయాలని ఆదేశించారు. కార్యక్రమంలో ఆర్డీవో సరిత, మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ బాబర్‌ఖాన్, సీనియర్ అసిస్టెంట్ మహేందర్‌గౌడ్, కాంగ్రెస్ మండలాధ్యక్షుడు కృష్ణారెడ్డి, దామోదర్‌రెడ్డి, పురుషోత్తంరెడ్డి, మల్లేష్‌గౌడ్, శ్రీనివాస్‌రెడ్డి, అంజిరెడ్డి, రాంచంద్రయ్య పాల్గొన్నారు.

హంతకులిద్దరికీ జీవిత ఖైదు

» ఒక్కొక్కరికీ రూ.వెయ్యి జరిమానా

వికారాబాద్/యాలాల, మే 12 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): హత్య కేసులో నిందితులిద్దరికీ జీవిత ఖైదుతోపాటు ఒక్కొక్కరికీ రూ.వెయ్యి జరిమానా విధిస్తూ జిల్లా ప్రిన్సిపల్ డిస్ట్రిక్ట్ అండ్ సెషన్స్ జడ్జి డాక్టర్ సున్నం శ్రీనివాస్‌రెడ్డి సోమవారం తీర్పునిచ్చారు. ఎస్పీ నారాయణ రెడ్డి వివరాలు వెల్లడించారు. కొడంగల్ మండలం ఎరన్‌పల్లి గ్రామానికి చెందిన దోమ బుగ్గప్ప అదే గ్రామానికి చెందిన రవీందర్‌గౌడ్‌ను చంపుతానని బెదిరించాడని 2 ఏప్రిల్ 2015న పోలీసులకు ఫిర్యాదు వచ్చింది. అప్పటి ఎస్ఐ ఆదేశాల మేరకు కానిస్టేబుల్ హరిలాల్ గ్రామానికి వెళ్లాడు. పంచాయతీ కార్యాలయం వద్ద రాములుగౌడ్, అతడి సోదరుడు లక్ష్మయ్యగౌడ్, పకీరప్ప, అప్పటి ఉప సర్పంచ్ నర్సప్పతో పాటు పలువురు గుమిగూడి కనిపించారు. కానిస్టేబుల్ బుగ్గప్ప గురించి ఆరా తీయగా, తిమ్మాయిపల్లి గేట్ వద్ద ఉన్నాడని తెలపడంతో అక్కడకు వెళ్లాడు. బుగ్గప్పను కానిస్టేబుల్ బైక్‌పై కూర్చోబెట్టుకుని కొడంగల్ పోలీసు స్టేషన్‌కు వెళ్తుండగా జుంటుపల్లి గేట్ దాటిన తర్వాత రాములుగౌడ్, అతడి సోదరుడు పకీరప్ప, నర్సప్పతోపాటు మరో ఇద్దరు బైక్‌ను ఆపారు. రాములుగౌడ్ బుగ్గప్పను లాగడంతో ఇద్దరూ కిందపడిపోయారు. రాములుగౌడ్ తన వెంట తెచ్చుకున్న వేట కొడవలితో బుగ్గప్ప తలపై బలంగా నరకడంతో అతడు రోడ్డుపై పడిపోయాడు. రాములుగౌడ్ సోదరుడైన లక్ష్మయ్యగౌడ్ తన అన్న వద్ద ఉన్న వేట కొడవలి తీసుకుని బుగ్గప్ప తల, ఇతర శరీర భాగాలను తీవ్రంగా గాయపరిచాడు. అదే సమయంలో ఇతరులు కూడా బుగ్గప్పను గాయపరిచారు. దీంతో బుగ్గప్ప ఘటన స్థలంలోనే ప్రాణాలు కోల్పోయాడు. తర్వాత అందరూ పారిపోయారు. ఈ ఘటనపై యాలాల్ పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు నమోదు కాగా అప్పటి యాలాల్ ఎస్ఐ రవికుమార్ కేసు నమోదు చేయగా, అప్పటి కరణ్‌కోట్ సీఐ శివశంకర్ దర్యాప్తు చేసి చార్జిషీట్ దాఖలు చేశారు. ఇరుపక్షాల వాదోపవాదాలు విన్న తర్వాత బుగ్గప్పను హతమార్చిన ఘటనలో నిందితులైన ఈడిగి రాములుగౌడ్, ఈడిగి లక్ష్మయ్యగౌడ్‌లకు జీవిత ఖైదుతోపాటు ఒక్కొక్కరికీ రూ.వెయ్యి జరిమానా విధించారు. నిందితులకు శిక్ష పడేలా చేసిన పబ్లిక్ ప్రాసిక్యూటర్లు నారాయణగౌడ్, రవికుమార్, సుధాకర్‌రెడ్డిలకు, దర్యాప్తు చేసిన అప్పటి, ప్రస్తుత ఇన్‌స్పెక్టర్లు శివశంకర్, నగేష్, యాలాల్ ఎస్ఐ గిరన్న, సీడీవోలు జి.శ్రీశైలం, ఎం.శ్రీనివాస్, బ్రీఫింగ్ అధికారి వీరన్నలను ఎస్పీ అభినందించారు.

గిరిజన గురుకుల జూనియర్ కళాశాలల్లో ప్రవేశానికి కౌన్సెలింగ్



హయత్‌నగర్, మే 12 (ఆంధ్రజ్యోతి): హైదరాబాద్, రంగారెడ్డి, మేడ్చల్, వికారాబాద్, సంగారెడ్డి జిల్లాల్లోని గిరిజన గురుకుల జూనియర్ కళాశాలల్లో 2025-26 విద్యా సంవత్సరానికి ఇంటర్ ఫస్ట్ ఇయర్‌లో చేరేందుకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు రీజినల్ కోఆర్డినేటర్ నాగార్జునరావు సోమవారం ప్రకటనలో తెలిపారు. ఈ నెల 15, 16 తేదీల్లో హయత్‌నగర్ కల్వంచ శాంతినగర్‌లోని బాలుర గురుకుల ప్రతిభ కళాశాలలో ఉదయం 10 గంటలకు కౌన్సెలింగ్ ఉంటుందని పేర్కొన్నారు. 15న బాలురకు, 16న బాలికలను కౌన్సెలింగ్ ఉంటుందన్నారు. కౌన్సెలింగ్‌కు హాజరయ్యే విద్యార్థులు బదిలీ ధ్రువీకరణ పత్రం, పదో తరగతిలో సాధించిన మార్కుల మెమో, స్టడీ, కండక్టు సర్టిఫికెట్లు, 2024-25 సంవత్సరానికి సంబంధించిన కుల, ఆదాయ ధ్రువీకరణ పత్రాలు తీసుకురావాలని కోరారు. గ్రామీణ ప్రాంతాల వారికి వార్షిక ఆదాయం రూ.1.5 లక్షలు, పట్టణ ప్రాంతాల వారికి రూ.2 లక్షలకు మించి ఆదాయం ఉండరాదని పేర్కొన్నారు. ఆధార్ జిరాక్స్, స్పోర్ట్స్, పీహెచ్‌సీ, ధ్రువీకరణ పత్రాలు, మూడు కలర్ పాస్ ఫొటోలు, రెండు జతల జిరాక్స్ కాపీలతో హాజరుకావాలని తెలిపారు.

కోర్సుల వివరాలు

జంగంమెట్ బాలికల కళాశాల, ఎంపీసీ, బైపీసీ కోర్సులు, (హైదరాబాద్ జిల్లా), ఇబ్రహీంపట్నం బాలుర కళాశాల, ఎంపీసీ, బైపీసీ కోర్సులు (రంగారెడ్డి జిల్లా), కందుకూరు బాలుర కళాశాల సీఈసీ, హెచ్ఈసీ(రంగారెడ్డి జిల్లా), కొత్తూరు బాలుర కళాశాల సీఈసీ, హెచ్ఈసీ (రంగారెడ్డి జిల్లా), కుల్కచర్ల బాలుర కళాశాల ఎంపీసీ, బైపీసీ కోర్సులు(వికారాబాద్ జిల్లా), కొడంగల్ బాలుర కళాశాల ఎంపీసీ, బైపీసీ కోర్సులు(వికారాబాద్ జిల్లా), తాండూరు బాలికల కళాశాల ఎంపీసీ, బైపీసీ కోర్సులు(వికారాబాద్ జిల్లా), జిన్నారం బాలుర కళాశాల ఎంపీసీ, బైపీసీ కోర్సులు (సంగారెడ్డి జిల్లా), నారాయణఖేడ్ బాలుర కళాశాల ఎంపీసీ, బైపీసీ కోర్సులు(సంగారెడ్డి జిల్లా), కంగ్టి బాలుర కళాశాల సీఈసీ, హెచ్ఈసీ(సంగారెడ్డి జిల్లా), జహీరాబాద్ బాలిక కళాశాల ఎంపీసీ, బైపీసీ కోర్సులు(సంగారెడ్డి జిల్లా), కరాసుగుత్తి బాలిక కళాశాల ఎంపీసీ, బైపీసీ కోర్సులు (సంగారెడ్డి జిల్లా) ప్రతి గ్రూపు నందు ఎస్టీ విద్యార్థులతో పాటు ఎస్సీ, బీసీ, ఓసీ, స్పోర్ట్స్, పీహెచ్‌సీ క్యాటగిరి నందు పరిమిత సీట్లు ఉన్నాయని తెలిపారు. వివరాలకు.. 95020 50715, 96034 31550 నంబర్లలో సంప్రదించాలని కోరారు.

పేరుకుపోతున్న ధాన్యం నిల్వలు

» కొనుగోలు కేంద్రాల్లో అధికారుల ఇష్టారాజ్యం

» వర్షానికి తడుస్తున్న ధాన్యం



మిట్టకోడూరు ధాన్యం కొనుగోలు కేంద్రంలో..

పరిగి, మే 12 (ఆంధ్రజ్యోతి): ధాన్యం కొనుగోళ్లలో అధికారులు నిర్లక్ష్యం ప్రదర్శిస్తున్నారు. సకాలంలో ధాన్యం తూకం వేసి మిల్లుకు తరలించడంలో అలసత్వం ప్రదర్శిస్తున్నారు. పరిగి మండలం మిట్టకోడూరు కొనుగోలు కేంద్రానికి ధాన్యం భారీగా వచ్చింది. తూకం వేయడంలో జాప్యం జరుగడంతో కేంద్రంలో ధాన్యం బస్తాల నిల్వలు పెరుకుపోయాయి. దీంతో రైతులు రాత్రిపూట అక్కడే నిద్రపోవాల్సి వస్తుంది. అది, సోమవారం సాయంత్రం వర్షం కురువడంతో ధాన్యం బస్తాలు తడిసిపోయాయి. రైతులు తాడిపత్రిలు కప్పినప్పిటికీ తడిసిపోయాయని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి కొనుగోళ్లను వేగవంతం చేయాలని రైతులు కోరుతున్నారు.

చెస్‌లో సత్తాచాటిన పట్లోళ్ల ఇంద్రారెడ్డి



చెస్ ఆడుతున్న పట్లోళ్ల ఇంద్రారెడ్డి

బంజారాహిల్స్ మే 12(ఆంధ్రజ్యోతి): యూరప్ బాస్నియాలో జరిగిన ఇంటర్నేషనల్ ర్యాపిడ్ చెస్ టోర్నమెంట్‌లో సిల్వర్ మెడల్ 1804 చెస్ ఫిడే రేటింగ్స్‌లో మాజీ మంత్రి, ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డి మనవడు పట్లోళ్ల ఇంద్రారెడ్డి సత్తా చాటాడు. ఇంటర్నేషనల్ రాపిడ్ చెస్ టోర్నమెంట్‌లో సిల్వర్ మెడల్ సాధించి 400 ఫిడే పాయింట్లను పెంచుకున్నాడు. 1804 పాయింట్లతో ఫిడే రేటింగ్స్‌లో తన ప్రతిభను కనబరిచాడు. గ్రాండ్ మాస్టర్ సలహాలు, సూచనలు పాటిస్తు గ్రాండ్ మాస్టర్ మరియన్ పెట్రోవ్‌తో కలిసి చెస్ ఆడుతూ కేవలం ఐదు నెలల్లోనే అత్యధిక పాయింట్లను సాధించి రేటింగ్స్‌ను పెంచుకున్నాడు. ఇంద్రారెడ్డి సిల్వర్ మెడల్ సాధించడం సంతోషంగా ఉందని ఏకాగ్ర చెస్ అకాడమీ సీఈఓ సందీప్‌నాయుడు, చీఫ్ కోచ్ చైతన్య సురేష్ తెలిపారు. నానమ్మ సబితా ఇంద్రారెడ్డి అందిస్తున్న ప్రోత్సాహంతోనే ఆట ఆడుతున్నానని ఇంద్రారెడ్డి తెలిపారు.



శంకర్‌లింగం చేతులమీదుగా పట్టా అందుకుంటున్న సామల నాగరాజు

ఇంజినీరింగ్‌లో పరిశోధనలు చేయాలి

మొయినాబాద్ రూరల్, మే 12(ఆంధ్రజ్యోతి): ఇంజినీరింగ్ విభాగంలో పరిశోధనలు చేయడం దేశానికి ఎంతో అవసరమని చైతన్య డీమ్డ్ యూనివర్సిటీ వైస్ చాన్స్‌లర్ ప్రొఫెసర్ శంకర్‌లింగం అన్నారు. మొయినాబాద్ మున్సిపల్ పరిధిలోని హిమాయత్‌నగర్‌లోని చైతన్య డీమ్డ్ యూనివర్సిటీలోని ఇంజినీరింగ్(ఈఈఈ) విభాగంలో సామల నాగరాజు ప్రొఫెసర్ బేతి చంద్రమౌళి పర్యవేక్షణలో 'గ్రిడ్ ఇంటిగ్రేషన్ ఆఫ్ హైబ్రీడ్ రెన్యూవబుల్ ఎనర్జీ సిస్టం విత్ ఫాక్ట్స్ యూసింగ్ నోవెల్ కంట్రోల్ టెక్నిక్ అనే అంశంపై పరిశోధన చేశారు. ఈ నేపథ్యంలో సోమవారం పట్టాను పొందారు. అనంతరం ఆయన మాట్లాడుతూ పరిశోధనలు చేసే విద్యార్థులకు తమ యూనివర్సిటీలో అన్ని సౌకర్యాలు కల్పిస్తామని తెలిపారు. విద్యతోపాటు పరిశోధనలు ఎంతో ముఖ్యమన్నారు. కార్యక్రమంలో రిజిస్ట్రార్ రవీందర్, రీసెర్చ్ డీన్ ఆచార్య క్రిష్టోఫర్, రాజు, జగదీశ్వర్, రాజేందర్‌రెడ్డి, జగదీష్‌కుమార్, అసిస్టెంట్ రిజిస్ట్రార్ అండ్ పబ్లిక్ రిలేషన్ ఆఫీసర్ రాంబాబు, విద్యార్థులు, అధ్యాపకులు పాల్గొన్నారు.



గిరిగేట్‌పల్లి బ్రిడ్జి కింద పారుతున్న మురుగు

రైల్వే బ్రిడ్జి కిందికి మురుగు

» దుర్వాసనతో వాహనదారుల ఇబ్బందులు

వికారాబాద్, మే 12 (ఆంధ్రజ్యోతి): పట్టణానికి చెందిన గిరిగేట్‌పల్లి గ్రామం వెళ్లే ప్రధాన రోడ్డులోని రైల్వే బ్రిడ్జి కింద డ్రైనేజీ నీరు వాగులా పారుతోంది. దీంతో దుర్వాసన వెదజల్లి వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారు. మున్సిపాలిటీలో డ్రైనేజీ వ్యవస్థ సరిగా లేదని అధికారులకు, కమిషనర్‌కు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడంలేదని స్థానికులు ఆరోపిస్తున్నారు. ఇప్పటికైనా డ్రైనేజీ సమస్యకు శాశ్వత పరిష్కారం చూపాలని ప్రజలు కోరుతున్నారు.

వైద్య ఆరోగ్య శాఖ మంత్రికి సన్మానం



మంత్రిని సన్మానిస్తున్న కాంగ్రెస్ నాయకులు

చౌడాపూర్, మే 12 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలో పీహెచ్‌సీ ఏర్పాటును హర్షిస్తూ మండల కాంగ్రెస్ నాయకులు వైద్య ఆరోగ్య శాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహను సన్మానించారు. కాంగ్రెస్ మండల అధ్యక్షుడు ఎల్పటి అశోక్‌కుమార్ మాట్లాడుతూ పీహెచ్‌సీ ఏర్పాటు గురించి ఎమ్మెల్యే రామ్మోహన్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లామని, సోమవారం మంత్రి సానుకూలంగా స్పందించి ఏర్పాటు చేయడం హర్షణీయమన్నారు.

నేడు స్పీకర్ పర్యటన

మోమిన్‌పేట్, మే 12 (ఆంధ్రజ్యోతి): మండలంలో పలు అభివృద్ధి కార్యక్రమాల శంకుస్థాపనకు స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్ మంగళవారం(నేడు) పర్యటించనున్నట్లు కాంగ్రెస్ మండల అధ్యక్షుడు శంకర్‌యాదవ్ తెలిపారు. బురుగుపల్లిలో సీసీరోడ్డు, రాళ్లగూడుపల్లి నుంచి సుద్దోడ్కతండా మీదుగా రూ.62లక్షలతో వేసిన బీటీరోడ్డు, మోమిన్‌పేట్, లచ్చనాక్‌తండాలో సీసీరోడ్డు ప్రారంభోత్సవం, మోమిన్‌పేట్‌లో ఇందిరమ్మ ఇంటికి భూమిపూజ, బిక్కరెడ్డిగూడెంలో బీటీరోడ్డుకు శంకుస్థాపన, గ్రామాల్లో సీసీరోడ్ల ప్రారంభోత్సవాలు, మల్లారెడ్డిగూడెంలో చెరువు మరమ్మతులకు శంకుస్థాపన నిర్వహించనున్నట్లు తెలిపారు.

వేసవి దుక్కులతో మేలు

- చీడపీడల నివారణకు దోహదం
- కలుపు మొక్కలకు చెక్
- రైతులకు వ్యవసాయాధికారుల సూచన

కొడంగల్ రూరల్, మే 12 (ఆంధ్రజ్యోతి): వేసవిలో భూములను దుక్కిదున్నడం వలన రైతులకు అధిక ప్రయోజనాలు పొందవచ్చని ఏడీఏ శంకర్ రాథోడ్ తెలిపారు. దుక్కులు దున్నడం వలన హితకారిణి సూక్ష్మజీవులు, వానపాముల సంతతి పెరుగుతుందని తద్వారా భూమి సారవంతమవుతుందన్నారు. కలుపు మొక్కలు, చీడపీడలను నివారించవచ్చని తెలిపారు. రైతులు వేసవిలో పొలాల్లో దుక్కులు దున్నడం వలన అధిక ప్రయోజనాలు కలుగుతాయని ఆయన వివరించారు.

చీడపీడల నివారణ

భూముల్లో ఏపంట వేయకుండా ఉండడంతో కలుపు మొక్కలు పెరిగి భూసారానికి నష్టం కలగజేయడంతో పాటు చీడపీడలకు ఆశ్రయం కల్పిస్తాయి. పంటకాలం ముగిసిన అనంతరం భూములను ఖాళీగా ఉంచడం వలన పంటలకు ఆశించే చీడ పురుగులు, తెగుళ్లను కలుగజేసే శిలీంద్రాల గుడ్లు భూమిపొరల్లో దాగుంటాయి. లోతుగా దుక్కులు దున్నడం వలన భూమిపొరల్లోని గుడ్లు వెలుపలికి వచ్చి బయటి ఉష్ణోగ్రతకు చనిపోతాయని తెలిపారు. బయటపడిన ప్యూపాలను గుడ్లను పక్షులు తినడంతో మున్ముందు వేసే పంటలకు చీడపురుగుల బాధ తప్పుతుందన్నారు. అదేవిధంగా కలుపు మొక్కలను నివారించవచ్చని తెలిపారు.



టేకుల్‌కోడ్ గ్రామ శివారులో పొలంలో దుక్కిదున్నుతున్న రైతు

వర్షాకాలానికి ముందే భూమిని దున్నాలి



వర్షకాలం రాక ముందే భూమిని దున్నాలి. దుక్కులను వీలైనంత లోతుగా, ఏటవాలుగా అడ్డంగా దున్నుకుంటె వర్షపునీరు భూమిలోకి ఇంకిపోయి తేమను నిల్వ చేసుకునే సామర్థ్యం పెరుగుతుంది. దుక్కులు దున్నే ముందు పశువుల పేడ, కంపోస్టు ఎరువులువేయడం మంచిది. భూములు దున్నకపోవడం వలన పొరలు గట్టిపడి పంటలు వేసిన సమయంలో వేర్లు భూమిలోకి వెళ్లలేవు. దీంతో మొక్కలకు పోషక పదార్థాలు సరిగా అందక వాటిలో ఎదుగుదల లోపిస్తుంది. ఇలా భూములను దుక్కి దున్నడం వలన రైతులకు అనేక ప్రయోజనాలు కలుగుతాయి. - శంకర్ రాథోడ్, ఏడీఏ, కొడంగల్

క్రైం కార్నర్

ఉరేసుకొని వ్యక్తి ఆత్మహత్య

ఘట్‌కేసర్ రూరల్, మే 12 (ఆంధ్రజ్యోతి): ఆర్థిక ఇబ్బందుల కారణంగా నెలకొన్న కుటుంబ కలహాలతో మనస్తాపానికి గురైన ఓ వ్యక్తి ఉరేసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఈ ఘటన ఘట్‌కేసర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. అడ్మిన్ ఎస్‌ఐ ప్రభాకర్‌రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. పెద్దపల్లి జిల్లా, గోదావరిఖనికి చెందిన గుటుకు శ్రీశైలం(45) ఘట్‌కేసర్ మున్సిపాలిటీ, బాలాజీనగర్‌లో నివాసముంటూ కీసర మండలం, బోగారంలోని లిక్కర్‌గోడౌన్‌లో పనిచేస్తుంటాడు. ఇటీవల అప్పులు ఎక్కువ కావడంతో తరచూ భార్యాభర్తల మధ్య కలహాలు చోటుచేసుకునేవి. మూడునెలల భార్య గొడపడి పుట్టింటికి వెళ్లింది. అప్పటి నుంచి ఒంటరిగా ఉంటున్నాడు. ఈ క్రమంలో బెడ్‌రూంలో సీలింగ్ ఫ్యాన్‌కు ఉరేసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. దుర్వాసన రావడంతో స్థానికులు గమనించి అతడి కుటుంబసభ్యులు, పోలీసులకు సమాచారం అందించారు. పోలీసులు ఘటనాస్థలానికి చేరుకొని డోర్‌తీసి చూసేసరికి కుళ్లిపోయిన స్థితిలో ఫ్యాన్‌కు వేలాడుతూ శ్రీశైలం మృతదేహం కనిపించింది. పోస్టుమార్టం నిమిత్తం గాంధీ ఆస్పత్రికి తరలించి మృతదేహాన్ని కుటుంబసభ్యులకు అప్పగించారు. మృతుడి కూతురు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు అడ్మిన్ ఎస్‌ఐ తెలిపారు.

కబేళాలకు తరలిస్తున్న కోడెలు, ఆవుల పట్టివేత



బండవెల్కిచర్లలో పట్టుకున్న కోడెలు, ఆవులు

కులకచర్ల, మే 12 (ఆంధ్రజ్యోతి): అక్రమంగా కబేళాలకు తరలించేందుకు సిద్ధంగా ఉంచిన 40కోడెలు, నాలుగు ఆవులను హిందూ సంఘాలు, గోసంరక్షణ సమితి సభ్యులు పట్టుకున్నారు. మండల పరిధిలో బండవెల్కిచర్ల గ్రామ పరిధిలో జరిగింది. స్థానికులు, పోలీసులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. బండవెల్కిచర్ల గ్రామానికి చెందిన మోహన్ సోమవారం గ్రామపరిధిలో ఆవులను కాస్తున్నాడు. కోడెలు, ఆవులను హైదరాబాద్‌లోని కబేళాలకు తరలిస్తున్నారనే సమాచారాన్ని తెలుసుకున్న హిందూ సంఘాలు, గోసంరక్షణ సంఘం సభ్యులు గ్రామానికి చేరుకొని కోడెలు, ఆవులు ఎవరివి, ఎక్కడికి తరలిస్తున్నారని ప్రశ్నించగా తనవికాదని, హైదరాబాద్‌కు చెందిన ఖాసీం అనే వ్యక్తివి అని, వాటిని సంరక్షిస్తున్నట్లు తెలిపాడు. ఈ విషయాన్ని స్థానికులు పోలీసులకు తెలపగా వారు ఘటనాస్థలానికి చేరుకొని వాటిని కరణ్‌కోట్ గోశాలకు తరలించారు. బీజేపీ మండల ప్రధాన కార్యదర్శి చెంచు హనుమంతు ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ అన్వేష్‌రెడ్డి తెలిపారు. ఈ కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర నాయకులు ప్రహ్లాద్‌రావు, మండల అధ్యక్షుడు వెంకటేశ్, గోసంరక్షణ సమితి ప్రచారక్ రఘోత్తమాచార్యులు, రాఘవేందర్‌గౌడ్ పాల్గొన్నారు.

యువతి పట్ల అసభ్యకరంగా ప్రవర్తించిన వ్యక్తిపై కేసు

ఘట్‌కేసర్ రూరల్, మే 12(ఆంధ్రజ్యోతి): యువతి పట్ల అసభ్య కరంగా ప్రవర్తించిన ఓ వ్యక్తిపై పోచారం ఐటీ కారిడార్ పోలీసులు కేసు నమోదు చేశారు. సీఐ రాజువర్మ తెలిపిన వివరాలిలా ఉన్నాయి. చౌదరిగూడకు చెందిన ఓయువతి(20) కిరాణ దుకాణం నిర్వహిస్తోంది. వారం రోజుల కిందట చౌదరిగూడ సాయినగర్ కాలనీకి చెందిన జాష్వ(21) దుకాణానికి వచ్చి కాగితం ముక్కపై తన ఫోన్‌నెంబర్ రాసి ఇచ్చి నిన్ను పెళ్లి చేసుకుంటా అని చెప్పి ఫోన్‌చేయమని చెప్పాడు. దీంతో సదరు యువతి పేపర్ ముక్కను చింపి కింద పడేసింది. తిరిగి మూడు రోజుల కిందట కిరాణ దుకాణానికి వచ్చి తనకు ఫోన్ చేయమని ఇబ్బందులకు గురిచేశాడు. ఫోన్ చేయకుంటే చనిపోతానని బెదిరింపులకు పాల్పడ్డాడు. అసభ్యకరంగా ప్రవర్తించి గట్టిగా అరుస్తూ దుకాణం చుట్టూ తిరుగుతున్నాడు. జాష్వ ఇబ్బందులు తాళ్లలేక సదరు యువతి సోమవారం పోచారం ఐటీకారిడార్ పోలీసులను ఆశ్రయించింది. బాధితురాలి ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

బీరుబాటిల్‌తో దాడి చేసిన వ్యక్తిపై..

ఘట్‌కేసర్ రూరల్, మే 12(ఆంధ్రజ్యోతి): మద్యం మత్తులో బీరుబాటిల్‌తో దాడిచేసి తీవ్రంగా గాయపరిచిన వ్యక్తిపై పోచారం ఐటీ కారిడార్ పోలీసులు కేసు నమోదుచేశారు. సీఐ రాజువర్మ తెలిపిన వివరాల ప్రకారం.. పోచారం మున్సిపాలిటీ అన్నోజిగూడ లక్ష్మీనర్సింహకాలనీకి చెందిన దేవరకొండ నరేష్‌చారి డ్రైవర్‌గా పనిచేస్తున్నాడు. ఆదివారం ఉదయం లారీపై వరంగల్‌కు వెళ్లి పనిముగించుకొని ఇంటికి వస్తుండగా రాత్రి అన్నోజిగూడలోని ఓ మద్యం దుకాణం వద్ద మద్యం తాగడానికి ఆగాడు. నరేష్ మద్యం తీసుకొని తాగుతుండగా పక్కన ఉన్న ఆటోడ్రైవర్ బాషికి, అతడి స్నేహితుడితో చిన్నపాటి గొడవ జరిగింది. మాటామాటా పెరిగి నరేష్ తలపై బాషి బీరుసీసాతో దాడిచేశాడు. దీంతో అతడి తీవ్రరక్తస్రావం కావడంతో చికిత్స నిమిత్తం స్థానికంగా ఉన్న ఓ ప్రైవేటు ఆస్పత్రికి తరలించారు. బాధితుడి ఫిర్యాదు మేరకు బాషిపై కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

దరఖాస్తులు 66,500.. యూనిట్లు 16,835

(ఐదో పేజీ తరువాయి)

సంబంధిత అధికారుల పర్యవేక్షణలో క్షేత్రస్థాయిలో పరిశీలన చేసి అర్హులను ఎంపిక చేయనున్నారు. కలెక్టర్ గౌతమ్ ఇటీవల సంబంధిత అధికారులతో సమావేశం నిర్వహించి అర్హులందరికీ ఈ పథకంతో లబ్ధి చేకూరే విధంగా చర్యలు చేపట్టాలని ఆదేశించిన విషయం తెలిసిందే.

ప్రత్యేక కమిటీల పర్యవేక్షణలోనే

పట్టణ పరిధిలో మున్సిపల్ కమిషనర్, మండల స్థాయిలో ఎంపీడీవో కన్వీనర్‌గా, మండల ప్రత్యేక అధికారి, సంబంధిత కార్పొరేషన్‌కు చెందిన అధికారి, డీఆర్‌డీవో నుంచి ఒకరిని సభ్యులుగా నియమించారు. జిల్లాలో స్థాయిలో కలెక్టర్ కన్వీనర్‌గా వివిధ శాఖల అధికారులతో పాటు బ్యాంకు అధికారి సభ్యులుగా ఉంటారు. గ్రామాల్లో పంచాయతీ కార్యదర్శులు దరఖాస్తులను పరిశీలిస్తారు. దరఖాస్తుదారులు గతంలో ఐదేళ్లుగా కార్పొరేషన్ల నుంచి ఏదైనా రుణాలు పొందారా? ఆ కుటుంబంలో ప్రభుత్వ ఉద్యోగులు ఉన్నారా? వారి ఆర్థిక పరిస్థితిని పరిశీలించి మండల కమిటీకి పంపిస్తారు. అక్కడి నుంచి ఆయా దరఖాస్తులను జిల్లా కమిటీకి పంపిస్తారు.

రాయితీ ఇలా..

ఈ పథకం కింద లబ్ధిదారులు ఎంపిక చేసుకున్న యూనిట్‌కు మొత్తం వ్యయంలో 70 నుంచి 100 శాతం రాయితీని ఇవ్వనున్నారు. ఇందులో రూ.లక్ష వరకు 90 శాతం రూ.2 లక్షల వరకు 80 శాతం, రూ.3- 4 లక్షల వరకు 70 శాతం రాయితీ చొప్పున ఇవ్వనున్నారు. రూ.50 వేల రుణాలకు సంబంధించి చిన్న యూనిట్లకు, చిన్న నీటిపారుదల పథకాలకు అందించే రుణాలకు బ్యాంకు లింకేజీతో సంబంధం లేకుండా వందశాతం రాయితీతో అందించనున్నారు.

ఇన్‌చార్జి మంత్రి పరిశీలన అనంతరమే..

ఈ పథకం లబ్ధిదారుల ఎంపిక ప్రక్రియ చివరగా జిల్లా ఇన్‌చార్జి మంత్రి ఆమోదంతోనే జరుగనుంది. మండల స్థాయి నుంచి జిల్లా స్థాయిలో పరిశీలన అనంతరం దరఖాస్తులను ఇన్‌చార్జి మంత్రి ఆమోదంతోనే లబ్ధిదారులను ఎంపిక చేయనున్నారు. ఎంపిక చేసిన లబ్ధిదారులకు జూన్ 2న రాయితీ రుణాలను అందించేందుకు అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు.

పరిశీలన వేగవంతం చేయాలి



సమావేశంలో మాట్లాడుతున్న సాంబశివరావు

రాజీవ్ యువ వికాసం పథకం దరఖాస్తుల పరిశీలన వేగవంతం చేసి, అర్హులను ఎంపిక చేసి జాబితాలను సంబధిత శాఖల అధికారుల లాగిన్‌లోకి పంపాలని రాజీవ్ యువవికాసం కమిటీ కన్వీనర్, డీఆర్‌డీవో సాంబశివరావు సూచించారు. సోమవారం కలెక్టరేట్‌లో పథకం అమలుపై నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఏ రోజుకారోజు వెరిఫికేషన్, పెండింగ్ వివరాలు అప్‌డేట్ చేయాలన్నారు. దరఖాస్తుదారుల ఎంపిక విషయంలో సంబంధిత అధికారుల మానిటరింగ్ తప్పనిసరి అన్నారు. సమావేశంలో ఎల్డీఎం వెంకటేశ్వరరావు, ఎస్సీ అభివృద్ధి శాఖ అధికారి వినోద్‌కుమార్, జిల్లా ఎస్సీ కార్పొరేషన్ ఈడీ బాబు మోసిస్, జిల్లా వ్యవసాయాధికారి చంద్రకళ, బీసీ వెల్ఫేర్ అధికారి రూప్సీలక్ష్మి, జిల్లా ఉపాధికల్పనశాఖాధికారి రాధిక, మత్స్య శాఖాధికారి తదితరులు పాల్గొన్నారు.

బల్దియాలో కార్మికులకు వేధింపులు

- శానిటరీ ఇన్‌స్పెక్టర్, జవాన్ల కుమ్మక్కు
- సీపీఎం జిల్లా జిల్లా కార్యవర్గ సభ్యుడు శ్రీనివాస్ ఆరోపణ

తాండూరు, మే 12 (ఆంధ్రజ్యోతి): తాండూరు మున్సిపాలిటీలో శానిటరీ ఇన్‌స్పెక్టర్, జవాన్లు కుమ్మక్కై కార్మికులను మార్పులు చేసి వేధిస్తున్నారని సీపీఎం జిల్లా కార్యవర్గ సభ్యుడు కె. శ్రీనివాస్ ఆరోపించారు. అధికారులు తమకు అనుకూలంగా ఉన్న జవాన్లను నియమించుకొని పనిచేయని వారికి కూడా జవాన్లు హాజరు వేస్తున్నారని తెలిపారు. సక్రమంగా హాజరు కాని కార్మికులకు పూర్తిహాజరు వేసి వారికి వచ్చిన వేతనంలో నుంచి అధికారులు జవాన్లు సగంసగం పంచుకుంటున్నారని పేర్కొన్నారు. అనుకూలంగా ఉన్న జవాన్లకు, అవసరమైన చోట పోస్టింగ్ ఇచ్చి మామ్ముళ్లు తీసుకుంటున్నారని ఆరోపించారు. అక్రమాలకు పాల్పడుతున్న వారిని గుర్తించి వెంటనే విచారణ జరిపి చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు.

రెండు రోజులు తాగునీటి సరఫరా నిలిపివేత

తాండూరు, మే 12 (ఆంధ్రజ్యోతి): రాఘవపూర్ వద్ద గేట్‌వాల్ మరమ్మతు కారణంగా తాండూరు నియోజకవర్గంలోని తాండూరు, పెద్దేముల్, యాలాల, ధారూర్ మండలంలోని గ్రామాలకు తాండూరు పట్టణానికి రెండు రోజులు తాగునీటి సరఫరాలో అంతరాయం ఏర్పాడుతుందని తాండూరు సబ్ డివిజన్ మిషన్ భగీరథ అధికారులు ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఈ కారణంగా ప్రజలు తాగు నీటిని పొదుపుగా వాడుకోవాలని కోరారు.

మాజీ సర్పంచ్‌కు ఘన నివాళి



నివాళులర్పిస్తున్న మాజీ ఎమ్మెల్యే మహేష్‌రెడ్డి

పూడూరు, మే 12 (ఆంధ్రజ్యోతి) మండలంలోని నిజాంపేట్ మేడిపల్లి గ్రామ మాజీ సర్పంచ్ చిట్యాల పెంటమ్మ అనారోగ్యంతో మృతి చెందిన విషయం విధితమే. ఆమె అంత్యక్రియలు సోమవారం స్వగ్రామంలో జరిగాయి. విషయం తెలుసుకున్న పరిగి మాజీ ఎమ్మెల్యే మహేష్‌రెడ్డి, మాజీ ఎంపీపీ మల్లేశం, బీఆర్ఎస్ నాయకులు పలువురు నివాళులర్పించారు. అంత్యక్రియల్లో పలువురు నాయకులు, గ్రామమస్తులు పాల్గొన్నారు.

బీజేపీ మండల కమిటీ ఎన్నిక



బీజేపీ మండల కమిటీని ఎన్నుకుంటున్న నాయకులు

బొంరాస్‌పేట్, మే 12 (ఆంధ్రజ్యోతి): బీజేపీ మండల కమిటీని సోమవారంఎన్నుకున్నారు. మండల అధ్యక్షుడు శ్రావణ్‌గౌడ్ ఆధ్వర్యంలో ప్రధాన కార్యదర్శిగా ఉప్పరి అనిల్ కుమార్, కుదురుమళ్ల మహేశ్, ఉపాధ్యక్షులుగా రాజరామ్‌రెడ్డి, మల్లేశం, బోయిని వెంకటేశ్, బంటు వెంకటేశ్, కార్యదర్శులుగా మైలారం అంజయ్య, రాథోడ్‌దశరథ్, కేతావత్ ప్రకాశ్, కేతావత్ కిషన్, కోశాధికారిగా మహేందర్‌గౌడ్, సోషల్ మీడియా కేతావత్ అనిల్‌ను ఎన్నుకున్నారు. ఈ కార్యక్రమంలో బీజేపీ నాయకులు నాగురావు, మల్లేశ్, బాబయ్యనాయుడు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ అంతరాయం

తాండూరు, మే 12 (ఆంధ్రజ్యోతి): పట్టణ 33కేవీ ఫీడర్‌పై మరమ్మతులు, చెట్టు కొమ్మల కటింగ్ పనులు చేపడుతున్నందున మంగళవారం ఉదయం 8గంటల నుంచి 11 గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని విద్యుత్‌శాఖ ఆపరేషన్ డీఈ వి.భానుప్రసాద్ తెలిపారు. వినియోగదారులు సహకరించాలని ఆయన కోరారు.

కార్పొరేట్‌కు దీటుగా ప్రభుత్వ వైద్యం

(ఐదో పేజీ తరువాయి)

ట్రామాకేర్ సెంటర్ ఏర్పాటు చేసే అంశాన్ని పరిశీలిస్తున్నామన్నారు. అలాగే పరిగిలోని డయాలసిస్ కేంద్రంలో మరో 5 పడకలు పెంచుతున్నట్లు మంత్రి ప్రకటించారు. ప్రజలు తమ ఆరోగ్యం పట్ల ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలన్నారు. బీపీ, డయాబెటిస్, క్యాన్సర్ వ్యాధిగ్రస్తుల సంఖ్య ఏటేటా పెరుగుతోందని ఆందోళన వ్యక్తం చేశారు. ఈ రోగులకు ఉచితంగా వైద్యం అందించేందుకు జిల్లా కేంద్రాల్లో ఎన్‌సీడీ క్లినిక్‌లు ఏర్పాటు చేశామన్నారు. రోడ్డు ప్రమాదాలు, ఇతర అత్యవసర సమయాల్లో ప్రజల ప్రాణాలు కాపాడేలా అత్యాధునిక వసతులతో హైవేల్లో ట్రామా కేర్ సెంటర్లను ఏర్పాటు చేస్తున్నట్లు మంత్రి తెలిపారు.

వికారాబాద్ ఆస్పత్రిలో సీటీస్కాన్, ఎంఆర్ఐ

ఏడాదిలోగా ప్రభుత్వ మెడికల్ కళాశాల, బాలురు, బాలికల వసతి గృహాల నిర్మాణ పనులు పూర్తయ్యేలా చర్యలు తీసుకుంటున్నామని మంత్రి దామోదర రాజనర్సింహ అన్నారు. సోమవారం వికారాబాద్ జిల్లా కేంద్రంలో రాజీవ్‌నగర్ కాలనీ వద్ద రూ.30 కోట్లతో నిర్మించిన 300 పడకల ప్రభుత్వ జనరల్ ఆస్పత్రిని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన వారితో కలిసి ఆసుపత్రిలోని విభాగాలను పరిశీలించి అనంతరం విద్యార్థులతో మాట్లాడారు. అనంతరం మంత్రి మీడియాతో మాట్లాడుతూ వికారాబాద్‌లో 50 పడకల క్రిటికల్ కేర్ విభాగం నిర్మాణం కొనసాగుతోందన్నారు. ఆసుపత్రి పాత భవనంలో ఇప్పటికే 70 పడకలు అందుబాటులో ఉన్నాయన్నారు. ట్రామా కేర్ సెంటర్ ద్వారా ప్రతి 35 కిలో మీటర్లకు ఒకచోట సీటీ స్కాన్, అంబులెన్స్ అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు. వికారాబాద్ ప్రభుత్వ జనరల్ ఆసుపత్రిలో సీటీ, ఎంఆర్ఐ స్కానింగ్ సదుపాయం త్వరలో అందుబాటులోకి రానున్నట్లు మంత్రి తెలిపారు. అనంతరం అంతర్జాతీయ నర్సుల దినోత్సవం సందర్భంగా ప్రభుత్వాసుపత్రిలో నర్సులను మంత్రి సన్మానించారు. ఈ కార్యక్రమంలో సూపరింటెండెంట్ రాంచంద్రయ్య పాల్గొన్నారు.



వికారాబాద్ ఆస్పత్రిని ప్రారంభిస్తున్న మంత్రి దామోదర్ రాజనర్సింహ

సేంద్రియ పద్ధతిలో సాగుచేయాలి



ఘట్‌కేసర్ రూరల్: మాట్లాడుతున్న వ్యవసాయ శాస్త్రవేత్త ప్రొఫెసర్ శారద

ఘట్‌కేసర్ రూరల్, మే 12 (ఆంధ్రజ్యోతి): రైతులు సేంద్రియ పద్ధతిలోనే సాగుచేయాలని వ్యవసాయ శాస్త్రవేత్త ప్రొఫెసర్ శారద తెలిపారు. వెంకటాపూర్ ముది రాజ్ భవనంలో సోమవారం జరిగిన రైతు ముగింట్లో శాస్త్రవేత్తల కార్యక్రమానికి ఆమె ముఖ్యఅతిగా పాల్గొన్నారు. పంటల మార్పిడితోనే భూసారం పెరుగుతుందని తెలిపారు. రైతులు వ్యవసాయ అధికారుల సలహాలు, సూచనలు పాటించి అధిక దిగుబడులు పొందాలన్నారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ శాస్త్రవేత్తలు నరేందర్ రెడ్డి, ఏడీఏ వెంకట్రామిరెడ్డి, మండల వ్యవసాయ అధికారి ఎంఎ బాసిత్, ఎఈవో మంజు ల, రైతులు తదితరులు పాల్గొన్నారు.

మూడుచింతలపల్లి: రైతును రాజు చేయడమే లక్ష్యమని ప్రొఫెసర్ డాక్టర్ పి.శ్రీదేవి అన్నారు. మండలంలోని అనంతారం, ఉద్ధమర్రి గ్రామాల్లో సోమవారం ప్రొఫెసర్ జయశంకర్ వ్యవసాయ విశ్వ విద్యాలయం, వ్యవసాయశాఖల ఆధ్వర్యంలో రైతు ముంగిట్లో శాస్త్రవేత్తలు అన్నదాతలకు అవగాహన కార్యక్రమంలో భాగంగా రైతు సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ అధికారి రవికుమార్, విద్యార్థులు భార్గవి, దివ్యారాణి, పంచాయితీ కార్యదర్శి రాజేశ్వర్ రెడ్డి, రైతులు పాల్గొన్నారు.



తాండూరు రూరల్: అనంతారంలో అవగాహన కల్పిస్తున్న శాస్త్రవేత్తలు

తాండూరు రూరల్: మండలంలోని బెల్కటూర్ రైతు వేదికలో రేపు(బుధవారం) 8గంటలకు రైతు ముంగిట్లో శాస్త్రవేత్తలు అవగాహన కార్యక్రమం ప్రారంభమవుతుందని తాండూరు మండల వ్యవసాయాధికారి కొమరయ్య తెలిపారు. ఈ కార్యక్రమాన్ని జిల్లా అధికారి మోహన్‌రెడ్డి ముఖ్యఅతిథిగా హాజరవుతున్నారని, శాస్త్రవేత్తలు, వ్యవసాయ ఉన్నతాధికారులు పాల్గొంటారని కొమరయ్య తెలిపారు.

గ్రామానికి గెజిట్ నోటిఫికేషన్ ఇవ్వండి

పూడూరు, మే 12, (ఆంధ్రజ్యోతి): మండలంలోని చీలాపూర్‌లో గెజిట్ నోటిఫికేషన్ ఇవ్వాలని కోరుతూ గ్రామస్తులు సోమవారం ప్రజాపాలనలో వికారాబాద్ కలెక్టర్‌కు వినతిపత్రం అందజేశారు. చీలాపూర్ గ్రామానికి గెజిట్ లేకపోవడంతో ప్రభుత్వ కార్యాలయంలో గ్రామం రికార్డుల్లో లేకుండాపోయింది. 1954 నుంచి 2002, 2003లో పాత సర్వేనెంబర్లు 164, 2003-2004లో కొత్తసర్వే నెంబర్లు 1 నుంచి 381 సర్వేనెంబర్లు ఉన్నాయి. కానీ అధికారులు సర్వే చేయాల్సి ఉండగా, అవేవి చేయకపోవడంతో రికార్డుల్లో గ్రామం పేరు లేకుండా పోయింది. పలుమార్లు గ్రామస్తులు కలెక్టర్‌తోపాటు, రెవెన్యూశాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, అధికారులకు విన్నవించినా ఎవరూ పట్టించుకోవడం లేదని గ్రామస్తులు వాపోయారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి తమ గ్రామంలో సర్వే నిర్వహించి గెజిట్ నోటిఫికేషన్ ఇవ్వాలని, భూభారతి రికార్డుల్లో తమ గ్రామ పేరును నమోదు చేయాలని గ్రామస్తులు కలెక్టర్‌కు ఇచ్చిన వినతిపత్రంలో పేర్కొన్నారు.

కానిస్టేబుల్ కుటుంబానికి ఆర్థిక సాయం

ఘట్‌కేసర్, మే 12 (ఆంధ్రజ్యోతి) ములుగు జిల్లాలో ఇటీవల మందుపాతర పేలి మృతిచెందిన గ్రేహౌండ్స్ కానిస్టేబుల్ సందీప్ కుటుంబసభ్యులకు ఘట్‌కేసర్‌లోని జనచైతన్య సేవాసమితి ఆధ్వర్యంలో రూ.50వేల ఆర్థికసాయాన్ని అందజేశారు. సందీప్ నివాసానికి సోమవారం వెళ్లి మృతుడి భార్య, తల్లిని కలిసి ఓదార్చారు. సందీప్ మృతి పట్ల విచారం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ అబ్బసాని యాదగిరి, ప్రేమ్ కుమార్, భూషన్, శశిధరన్, ఖయ్యూం, శ్రీనివాస్, రవీందర్, సురేష్, గోపాల్, జగదీష్ తదితరులు పాల్గొన్నారు.



ఆర్థిక సాయం అందజేస్తున్న నాయకులు

ఎల్లమ్మ ఆలయంలో ప్రత్యేక పూజలు



పూజల్లో భక్తులు

దుద్యాల, మే 12 (ఆంధ్రజ్యోతి): పోలెపల్లి రేణుక ఎల్లమ్మ ఆలయంలో సోమవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. పౌర్ణమి సందర్భంగా అమ్మవారికి భక్తులు అభిషేకం, ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం దంపతులు హోమం నిర్వహించారు. ప్రతీ పౌర్ణమి సందర్భంగా నిర్వహించే హోమంలో పాల్గొనేందుకు భక్తులు తమ పేర్లను నమోదు చేసుకోవాలని ఆలయ మేనేజర్ రాజేందర్‌రెడ్డి తెలిపారు.

కొత్లాపూర్ జాతర ప్రారంభం

తాండూరు రూరల్: భక్తులు కోరిన కోర్కెలు తీర్చే కొంగు బంగారంగా వెలుగుతున్న తాండూరు మండలం కొత్లాపూర్ రేణుకా ఎల్లమ్మ జాతర సోమవారం ప్రారంభమైంది. ఈ సందర్భంగా అమ్మవారికి అభిషేకం, ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. జూన్ 11వ తేదీ పౌర్ణమి రోజు వరకు నెల రోజుల పాటు ఈ ఉత్సవాలు జరుగనున్నాయి. ఈ సందర్భంగా భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అన్ని ఏర్పాట్లు చేసినట్లు ఆలయ చైర్మన్ పి.నవీన్‌చంద్రారెడ్డి, కార్యనిర్వాహణాధికారి జి.శేఖర్‌గౌడ్ తెలిపారు.

అ'పూర్వ' సమ్మేళనం



సమ్మేళనంలో ఉపాధ్యాయులు, పూర్వ విద్యార్థులు

మోమిన్‌పేట్, మే 12 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలో 1999-2000 పదో తరగతి బ్యాచ్‌కు చెందిన విద్యార్థులు సోమవారం ఆత్మీయ సమ్మేళనాన్ని ఘనంగా జరుపుకున్నారు. 25 సంవత్సరాల అనంతరం పాఠశాలలో చదువుకున్న విద్యార్థులు ఒకే వేదికపై కలుసుకొని అప్పటి మధుర జ్ఞాపకాలను గుర్తుచేసుకున్నారు. అప్పట్లో విద్యాబుద్ధులు నేర్పించిన ఉపాధ్యాయులను పూర్వ విద్యార్థులు సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు నారాయణరెడ్డి, వెంకటయ్య, బక్కయ్య, మనోహర్, రిజ్వానా బేగం, జనార్ధన్, రుక్మయ్య, రమేశ్‌రెడ్డి, చంద్రశేఖర్‌రావు, మల్లేశం, పూర్వ విద్యార్థులు వెంకన్న, రవి, శ్రీనివాస్, ప్రభయ్య, శ్రీకాంత్, నాగయ్య, శివకుమార్, ప్రశాంత్, దేవకుమార్, కాంతారావు, శేఖర్, ఫసియోద్దీన్, కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

ఇందిరమ్మ ఇళ్లు కేటాయించాలి

తాండూరు రూరల్, మే 12 (ఆంధ్రజ్యోతి): ఇందిరమ్మ ఇళ్ల జాబితాలో తమ పేర్లు రాలేవని, తమకే ఇందిరమ్మ ఇళ్లు కేటాయించాలని కోరుతూ తాండూరు మండలం కరన్‌కోట్ గ్రామానికి చెందిన చింతకింద శ్రీహరి సోమవారం ప్రజాపాలనలో తహసీల్దార్‌కు వినతి పత్రం అందజేశారు.



ప్రజావాణిలో వినతిపత్రం అందజేస్తున్న స్థానికుడు